ప్రజాశక్తి

మంగళవారం 19 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

బడుగుల చదువుపై చేతులెత్తేశారా ?

ఫ్రీ సీట్లును ప్రైవేటు యాజమాన్యాలు కొనసాగించడం లేదని కలెక్టరేట్ ఎదుట వాపోతున్న విద్యార్థుల కుటుంబీకులు

- 12(1)సి విద్యాహక్కు చట్టం రద్దుపై కోర్టు తీర్పు ఇచ్చిందంటూ ఉచిత సీట్లకు 'ప్రైవేటు' ఎగనామం
- తల్లిదండ్రుల నుంచి వెల్లువెత్తుతున్న వినతులు
- 25 శాతం సీట్ల రద్దుపై విద్యాశాఖకు అందని ఉత్తర్వులు
- యధాతథ స్థితిని అమలు చేయాల్సిందే : డిఇఒ ప్రేమ్‌కుమార్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ప్రైవేట్ స్కూళ్లలో 25 శాతం విద్యాహక్కు చట్టం సీట్లను రద్దు చేసుకోవచ్చంటూ విశాఖ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఇంతవరకూ ఎలాంటి ఉత్తర్వ్యూ, జీవో రాలేదు. కానీ విచిత్రమేమిటంటే ప్రైవేట్ స్కూల్ యజమానులు ఈ సీట్లు ఇవ్వలేమంటూ చేతులెత్తేస్తున్నారు. ఈ చర్య ఫ్రీ సీట్లపై ఆధారపడే బడుగు, బలహీన తరగతుల పిల్లల చదువులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇప్పుడిప్పుడే పిల్లల తల్లిదండ్రులు ఆర్థిక భారాన్ని మోయలేకపోతున్నామంటూ జిల్లా కలెక్టర్, విద్యాశాఖ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. కోర్టు జడ్జిమెంట్ ద్వారా 25 శాతం సీట్లు ఇవ్వనవసరం లేదని చెప్పేసిందన్న వాదనలను ప్రైవేట్ యాజమాన్యాలు ముందుకు తెస్తున్నాయి. ఈ వ్యవహారంపై కూటమి పాలకులు మౌనం దాల్చడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

విద్యాహక్కు చట్టం ఏం చెబుతోంది ? ఏం జరుగుతోంది ?

నిజంగా ఇది విచిత్రమైన పరిస్థితే. 'విద్య లేని వాడు వింత పశువు' అనేది పాత సామెత. ఇది అందరికీ తెలిసిందే. కానీ నేటి పాలకులు ఇలాంటి వింత పశువులను తయారు చేసే పనిలో ఉన్నారా ? అంటే బలహీన తరగతుల చదువుపై తాజా కోర్టు తీర్పులు, ప్రభుత్వాల మౌనం, ప్రైవేట్ స్కూళ్ల బెదిరింపులు చూస్తే అవుననే అనిపిస్తోంది. సామాజికంగా, ఆర్థికంగా బలహీన తరగతుల పిల్లల ఉచిత నిర్బంధ విద్యకు సంబంధించి 2009 ఆర్‌టిఇ చట్టం 12(1)సి ప్రకారం ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు తప్పనిసరిగా 25 శాతం ఫ్రీ సీట్లను మిగతా 2లో..

పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న విశాఖ బాలోత్సవం నిర్వాహకులు

నేడే విశాఖ బాలోత్సవం ప్రారంభం

- మూడు రోజులపాటు సెయింట్ ఆంథోని హైస్కూల్ వేదికగా ప్రదర్శనలు
- ఏర్పాట్లు పూర్తి
- 10 వేల మంది పాల్గొనే అవకాశం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ పిల్లల పండగకు సిద్ధమైంది. చిన్నారుల ఆటపాటలు మంగళవారం నుంచి మూడు రోజులపాటు హుషారెక్కించనున్నాయి. గత ఏడాది కంటే మిన్నగా నగరంలో 'విశాఖ బాలోత్సవం'ను 19, 20, 21 తేదీల్లో నిర్వహించనున్నట్టు బాలోత్సవం ప్రధాన కార్యదర్శి జివిఎస్.రాజేశ్వరరావు, అధ్యక్షులు పి.రఘు తెలిపారు. మహారాణిపేటలోని సెయింట్ ఆంథోని హైస్కూల్ కళావేదిక ప్రాంగణంలో మంగళవారం ఉదయం 10 గంటలకు బాలోత్సవం ప్రారంభమవుతుందని వెల్లడించారు. సోమవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. మంగళవారం ఉదయం 10 గంటలకు జరిగే ప్రారంభ సభకు ముఖ్య అతిథిగా డిఇఒ కె.ప్రేమకుమార్ హాజరవుతున్నారని తెలిపారు. గత సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా బాలోత్సవాన్ని సెయింట్ ఆంథోనీ స్కూల్లోనే నిర్వహిస్తున్నామని, ఏర్పాట్లు పూర్తయ్యాయని చెప్పారు. గత సంవత్సరం 6 వేల మంది పిల్లలు 84 ఈవెంట్లలో పాల్గొనగా ఈ సంవత్సరం పది వేల మంది పాల్గొనే అవకాశముందన్నారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, జివిఎంసి కమిషనర్, విఎంఆర్‌డిఎ కమిషనర్, డిఇఒ తదితర మిగతా 2లో..

సమస్యలపై 108 ఉద్యోగుల నిరాహార దీక్షలు

వార్త 5లో..

నర్సీపట్నంలో యువకుడు హత్య

వార్త 8లో..

నీటి సరఫరా, పారిశుధ్యంపై యాక్షన్ ప్లాన్

వార్త 2లో..

బాధ్యతల స్వీకరణ అనంతరం మీడియాతో మాట్లాడుతున్న శ్రావణ్ కుమార్

గిరిజన రైతుల సంక్షేమమే ధ్యేయం

బాధ్యతల స్వీకరణలో జిసిసి చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : గిరిజన రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని గిరిజన సహకార సంస్థ (జిసిసి) చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ పేర్కొన్నారు. ఆయన బీచ్ రోడ్డులోని జిసిసి కార్యాలయంలో సోమవారం ఉదయం చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తనకు ఈ పదవి ఇచ్చిన నారా చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. ఇది గిరిజనులకు దక్కిన గౌరవమని పేర్కొన్నారు. మన్యం అభివృద్ధికి జిసిసి తోడ్పాటునిస్తోందన్నారు. నిజాయితీ, నిబద్ధతతో పనిచేస్తామన్నారు. సిఎం విజన్‌తో అరకు కాఫీ ప్రపంచ దేశాలకు విస్తరించనుందన్నారు. దళారుల బారి నుంచి గిరిజన రైతులను రక్షిస్తానన్నారు. సంస్థ మిగతా 2లో..

హామీలు నెరవేర్చాలని ఆశాల ధర్నాలు

అనకాపల్లిలో ఆశాల ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న శంకరరావు

ఆశా వర్కర్లకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గత ప్రభుత్వంతో జరిగిన చర్చల జిఒలను విడుదల చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో సోమవారం భారీ ధర్నాలు జరిగాయి. పెద్ద సంఖ్యలో హాజరైన ఆశా కార్యకర్తలు సమస్యలపై నినదించారు.

ప్రజాశక్తి - అనకాపల్లి : ఆశాలు అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు మాట్లాడుతూ ఆశాలకు గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని, పనిభారం తగ్గించాలని, పాడైన సెల్ ఫోన్లు స్థానంలో కొత్త 5జి సెల్ ఫోన్లు ఇవ్వాలని కోరారు. రాజకీయ వేధింపులు, తొలగింపులు ఆపాలని, వేతనంతో కూడిన మెటర్నిటీ లీవులు, మెడికల్ లీవులు, నాణ్యమైన యూనిఫారాలు ఇవ్వాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ఆశా కార్యకర్తలు స్థానికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్, జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రుల్లో సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారికి సంబంధం లేని డ్యూటీలు వేస్తున్నారని, రోజుకొక ఆశా వర్కర్‌ని ఉదయం నుంచి మిగతా 2లో..

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నినదిస్తున్న ఆశా కార్యకర్తలు

మొదటి పేజీ తరువాయి..

బడుగుల చదువుపై చేతులెత్తేశారా ?

1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ ఇవ్వాల్సి ఉంది. కానీ రాష్ట్రంలో అధికారం 'కూటమి' పార్టీలైన టిడిపి, జనసేన, బిజెపి చేతుల్లోకి వచ్చాక 'రివర్స్' అయ్యిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు 25 శాతం బలహీన తరగతుల సీట్లను తాము ఇవ్వలేమంటూ హైకోర్టును ఆశ్రయించగా కోర్టు జడ్జిమెంట్ ఇచ్చిందని వారు చెప్పుకుంటూ వస్తున్నారు. కానీ ఆ కాపీ ఇంతవరకూ ప్రైవేట్ స్కూళ్లకుగానీ, ప్రభుత్వానికిగానీ అందలేదు. అయినా సరే ఆర్‌టిఇ 12(1)సి అమలు చేసేది లేదంటూ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు నాలుగు నెలలుగా చేతులెత్తేశాయి. గతంలో అమ్మ ఒడి అమల్లో ఉండేది. గత ఎన్నికల సమయంలో తల్లికి వందనం ఇస్తామని కూటమి పార్టీల సారథి చంద్రబాబు హామీ ఇచ్చారు. కానీ నేడది అమలు కావడం లేదు. దీంతో తల్లిదండ్రులపై మరో భారాన్ని కోర్టు తీర్పు ద్వారా మోపినట్లయింది. తల్లికి వందనం అయినా ఇవ్వాలి లేదంటే ఆ పథకం వచ్చే వరకైనా కోర్టు ఈ చట్టం రద్దును నిలుపుదల చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వెలుబుచ్చారు. తమ పిల్లలకు ఫ్రీ సీట్లు ఇవ్వాలని నినదించారు.

పిల్లల తల్లిదండ్రులకు ఘోర అవమానాలు

విశాఖ నగరంలోని పలు స్కూల్స్ ఆర్‌టిఇ చట్టాన్ని ఒక్కొక్కటిగా ఉల్లంఘిస్తూ వస్తున్నాయి. ఎప్పుడో కోర్టు జడ్జిమెంట్ ఇచ్చేసిందంటూ భాష్యం లాంటి విద్యాసంస్థలు పిల్లలను గేటు నుంచే బయటకు నెట్టేస్తున్నాయి. దీంతో తల్లిదండ్రులు తీవ్ర ఆవేదనకు గురౌతున్నారు. తాజాగా గాజువాకలోని భాష్యం స్కూల్ యాజమాన్యం తలిదండ్రులపై మొరటుగా వ్యవహరించిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఆ పాఠశాలలో 25 శాతం సీట్లతో చదువులు సాగిస్తున్న పిల్లలు, వారి తల్లిదండ్రులు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ గ్రీవెన్స్ సెల్‌కు విచ్చేసి తమ గోడు వెల్లదీసుకున్నారు. జిఒ కాపీ ప్రభుత్వం నుంచి వచ్చే వరకూ ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు ఆగడం లేదని పలువురి నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లా విద్యాశాఖాధికారి ఏమన్నారంటే...

జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్ సోమవారం మండల విద్యా కార్యాలయాల అధికారులతో నిర్వహించిన వెబెక్స్ సమావేశంలో మాట్లాడుతూ 'ఆర్‌టిఇ -12(1) విద్యార్థులుగా ఉచిత సీట్లు వచ్చిన వారి విషయంలో ప్రభుత్వం నుంచి ఆపేయాలన్న ఉత్తర్వులు, జీవో ఏమీ రాలేదు. కోర్టు జడ్జిమెంట్ కాపీ కూడా లేదు. ఎవరైనా ప్రైవేట్ స్కూల్స్ వారు ఇబ్బంది పెడితే వారిని మీరు తెలియజేయాలి. యధాతథ స్థితి అంటే 25 శాతం ఉచిత సీట్లు ప్రతి స్కూల్ ఇవ్వాల్సిందే, విద్యార్థులను కొనసాగించాల్సిందే' అని వెల్లడించారు. పేపర్లలో వచ్చినంత మాత్రాన పాలో అవ్వాల్సిన అవసరం లేదని చెప్పినట్లు తెలుస్తోంది.

హామీలు నెరవేర్చాలని ఆశాల ధర్నాలు

సాయంత్రం వరకు సబ్ సెంటర్లో, సచివాలయాల్లో ఉంచుతున్నారన్నారు. జిల్లా ఆసుపత్రికి వచ్చే ఆశాలు గర్భిణులు డెలివరీ అయ్యే వరకు వారితో ఉండాల్సి వస్తోందని, ఆ సమయంలో ఆశా వర్కర్లు సేదతీరడానికి విశ్రాంతి గది లేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి అన్ని జిల్లాల్లో యూనియన్ ప్రతినిధులకు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ఉమ్మడి సమావేశం వేసి చర్చించాలని, అనకాపల్లి జిల్లాలో మాత్రం ఉమ్మడి సమావేశం నేటి వరకూ ఏర్పాటు చేయలేదని అన్నారు. ధర్నాలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇ.పార్వతి, కె.శాంతి, రాష్ట్ర కార్యదర్శి వి.సత్యవతి, జిల్లా కార్యదర్శి కె.వరలక్ష్మి, నాయకులు బి.రామలక్ష్మి, అరుణ, కె.లక్ష్మి, చిట్టెమ్మ, కనకమహాలక్ష్మి, సిఐటియు జిల్లా కోశాధికారి వి.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున ఆశాలు ధర్నా నిర్వహించారు. వారినుద్దేశించి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు పి.మణి, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు కనీస వేతనం అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందన్నారు. అలాగే ఈ ఏడాది ఫిబ్రవరి 9న రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్స్‌తో చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలన్నారు. వాటికి సంబంధించిన జిఒలను, సర్క్యులర్లను ఇంతవరకు విడుదల చేయలేదని, 9 నెలలు కావొస్తున్నా ఫైలు ఫైనాన్స్ సెక్షన్‌లో ఉందని చెబుతున్నారని తెలిపారు. ఇంత వరకూ ఏ హామీ నెరవేరలేదన్నారు. వేతనాలు పెరగలేదన్నారు. రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకి పెంచుతామని ఇచ్చిన హామీ, మట్టి ఖర్చుల కింద రూ.20 వేలు ఇస్తామన్న హామీ సంగతి ఏంటని ప్రశ్నించారు. వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, గ్రూప్ ఇన్సూరెన్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ హామీలను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని విమర్శించారు. ధర్నాలో యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.పద్మ, వి.మేరీ, కోశాధికారి వై.సీతారత్నం, జిల్లా నాయకులు సన్యాసి పైడమ్మ, రవణమ్మ, సరోజిని, లక్ష్మి, విజయలక్ష్మి, దయానా, సుజాత, సరస్వతి, శ్యామల, రేణుక, లీలారాణి, అనురాధ పాల్గొన్నారు.

గిరిజన రైతుల సంక్షేమమే ధ్యేయం

పాత వాహనాలకు మరమ్మతులు, కొత్తవి కొనుగోలు, ఉద్యోగ కల్పన, పంట నష్టం లేకుండా చూడటం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సీతంపేట, కొమరాడ ప్రాంతాల్లో పెట్రోల్ బంకులు ఏర్పాటు చేస్తామని, అంతేకాకుండా ప్రస్తుత జిసిసి కార్యాలయం స్థానంలో 16 అంతస్తులతో కొత్త భవనం నిర్మిస్తామని, దేశంలోని అన్ని ప్రముఖ నగరాల్లో అరకు కాఫీ లభించేలా చర్యలు చేపడతామని తెలిపారు. మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా టిటిడికి జిసిసి సరుకులు సరఫరా కొనసాగిస్తామన్నారు. రేషన్ వాహనాల ద్వారా జిసిసి ఉత్పత్తులు విక్రయించే విషయం గురించి పౌర సరఫరాల శాఖ మంత్రితో చర్చిస్తామని అన్నారు. అనంతరం జిసిసి వైస్ చైర్మన్ అండ్ ఎమ్‌డి కల్పనా కుమారి మాట్లాడుతూ త్వరలోనే జిసిసి ద్వారా లిక్విడ్ కాఫీ అందిస్తామని, ఐటి సంస్థలలో రాయితీ కోసం ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జడ్‌పి మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'ఉక్కు' దీక్షలు

ప్రజాశక్తి - ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షలు సోమవారం నాటికి 1376వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలనుద్దేశించి స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ, ఈ నెల 29వ తేదీన ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్నం వస్తున్న సందర్భంగా విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ ఆపుతున్నామని స్పష్టమైన ప్రకటన చేయాలని విజ్ఞప్తి చేశారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు కార్మికులకు, కాంట్రాక్ట్ కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని కోరారు. ఉన్నత యాజమాన్యం జీతాలను తీసుకుంటూ కార్మికులకు, అధికారులకు వేతనాలు ఇవ్వకుండా వేధించడం మంచిది కాదన్నారు. కార్మికులను, అధికారులను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తామని బెదిరించడం మానుకోవాలన్నారు. దీక్షా శిబిరంలో డి.ఆదినారాయణ, వరసాల శ్రీనివాసరావు, డిసిహెచ్ వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన దీక్షలు సోమవారానికి 1333వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు జగదాంబ జోన్ నాయకులు కూర్చున్నారు. వారినుద్దేశించి సంఘం సీనియర్ నాయకులు వై.రాజు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశభక్తి పేరు చెప్పి దేశ సంపదను కారు చౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతోందన్నారు. స్టీల్ ప్లాంట్‌కు చెందిన వేలాది ఎకరాల భూములను అదానీ కంపెనీకి ఇవ్వడానికి మోడీ ప్రభుత్వం పూనుకుందన్నారు. పోరాటాలతో ప్లాంట్‌ను కాపాడుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సంఘం జగదాంబ జోన్ ప్రధాన కార్యదర్శి కెవిపి.చంద్రమౌళి, జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, హోటల్ యూనియన్ నాయకులు ఎర్రిబాబు, హాస్పిటల్ యూనియన్ నాయకులు నూకరాజు, సేఫ్ ప్యాకర్స్ అండ్ మూవర్స్ నాయకులు రాంబాబు, శ్రీనివాస్, సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద దీక్షల్లో కూర్చున్న సిఐటియు నాయకులు

కలెక్టర్‌కు వినతి

విశాఖ కలెక్టరేట్ : విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు తక్షణం కేటాయించాలని, రన్నింగ్ క్యాపిటల్ కింద రూ.11 వేలు తక్షణం అందివ్వాలని ఉత్తరాంధ్ర ప్రజా సంస్థ కన్వీనర్ వి.వి.రమణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అరుణోదయ అధ్యక్షురాలు కె.నిర్మల, చైతన్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు డి.లలిత, ఐఎఫ్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు, సమాజ చైతన్య వేదిక కార్యదర్శి రాంప్రభు, పిడిఎస్‌ఒ కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.

నీటి సరఫరా, పారిశుధ్యంపై యాక్షన్ ప్లాన్

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా సురక్షిత మంచినీటిని సరఫరా చేయడంతో పాటు పారిశుధ్య ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని జిల్లా నీరు, పారిశుధ్య మిషన్ కమిటీ అధికారులను జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆయన అధ్యక్షతన జిల్లా నీరు, పారిశుధ్య మిషన్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సురక్షిత మంచినీటిని సరఫరా చేయడంతో పాటు పారిశుధ్య ప్రణాళికలు అమలు చేయడం, కమ్యూనిటీ టాయిలెట్లు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో టాయిలెట్లు, పిహెచ్‌సి, సిహెచ్‌సిలలో టాయిలెట్లు, మంచి నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. గ్రామాలలో కమ్యూనిటీ టాయిలెట్లు పరిశుభ్రతలో మొదటి మూడు పంచాయతీలకు నగదు బహుమతి ప్రకటించాలన్నారు. ఈ నెల 19 నుండి డిసెంబర్ 10 వరకు గ్రామ స్థాయి సమావేశాలు నిర్వహించి గ్రామంలో ఏయే అవసరాలు ఉన్నాయి అనేదానిపై యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. గ్రామస్థాయి యాక్షన్ ప్లాన్ ఆధారంగా జిల్లా స్థాయిలో యాక్షన్ ప్లాన్ తయారు చేసుకోవడం జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రేమ్ కుమార్, డ్వామా పీడీ పూర్ణిమ దేవి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.

పన్ను చెల్లింపు పత్రాలతో కమిషనర్, పోర్టు అధికారులు

జివిఎంసికి విశాఖ పోర్టు రూ.10 కోట్ల ఆస్తి పన్ను చెల్లింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జివిఎంసికి చెల్లించవలసిన ఆస్తి పన్ను రూ.10 కోట్లను చెక్కు రూపంలో సోమవారం అందజేసింది. ఈ కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విశాఖపట్నం పోర్టు అథారిటీ ఫైనాన్స్ మేనేజర్ రమణమూర్తి, జివిఎంసి అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణ పాల్గొన్నారు.

నేడే విశాఖ బాలోత్సవం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి..) పెద్దల సారథ్యంలో ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఉపాధ్యక్షురాలు డాక్టర్ కె.రమాప్రభ మాట్లాడుతూ 700 స్కూళ్లకు బాలోత్సవ పోటీల బ్రోచర్‌ను పంపామని, అనూహ్యమైన స్పందన కనిపిస్తోందని అన్నారు. పోటీలు జరిగే 76 ఈవెంట్లకు జడ్జీలుగా వ్యవహరించేందుకు కళా, సాంస్కృతిక రంగాల్లో నిష్ణాతులైన 96 మంది అంగీకరించారని తెలిపారు. కోశాధికారి దండు నాగేశ్వరరావు, కమిటీ సభ్యులు ఎం.ఎల్లాజీ, సిహెచ్.సత్యనారాయణ మాట్లాడుతూ పాల్గొనే పిల్లలందరికీ సర్టిఫికెట్లు, విజేతలకు మెమెంటోలు ఇస్తున్నామని, అలాగే ప్రాంగణంలో మూడు పెద్ద స్టేజీల ఏర్పాటుతో పాటు డెకరేషన్ ఏర్పాట్లు కూడా ఇప్పటికే పూర్తయ్యాయని చెప్పారు. బాలోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ప్రకటన

మహారాజశ్రీ తణుకు Tenancy Tribunal Cum Principal Civil Judge (Junior Division) వారి కోర్టులో

I.A.2/2024 in A.T.C 4/2017

పిటీషనరు: కొప్పిశెట్టి వెంకటనారాయణ

And

2వ రెస్పాండెంటు : చేకూరి విజయలక్ష్మి, D/o.K.సూర్యనారాయణరాజు, D.No.50-24-24/1, T.P.T.కాలనీ, సీతమ్మధార, విశాఖపట్టణం.

పై నెంబరు పిటీషన్‌లో పిటీషనరు మీకు ఎన్నిమార్లు నోటీసులు పంపినప్పటికి మీరు పుచ్చుకొనక Avoid చేయుచున్నందున మీకు Substitute Service ద్వారా Notice లు అమలు జరపవలసిందిగా శ్రీకోర్టు వారు ఉత్తర్వులు ఇచ్చియున్నారు. కావున ఈ ప్రకటన తేది లగాయితు నెల రోజులలో మీరు పై కోర్టు వారి ఎదుట హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును. ఇందుమూలంగా తెలియజేయడమైనది.

A.APPA RAO, B.A.,B.L.
Advocate, Tanuku, W.G.Dt.
Cell: 93962 89499.

బకాయి జీతాలు చెల్లించాలని ధర్నా

ప్రజాశక్తి -మధురవాడ : మూడు నెలల జీతాలు విడుదలచేయాలని డిమాండ్ చేస్తూ మధురవాడ జోన్ -2 కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన జివిఎంసి ప్రజారోగ్య విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు, డైలీ వేజ్ కార్మికులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం జోనల్ కమిషనర్ పి.సింహాచలానికి వినతిపత్రం అందించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు మధురవాడ జోన్ ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు మాట్లాడుతూ, ఎండనక, వాననక కష్టపడి పనిచేస్తున్న కార్మికులను పస్తులు పెట్టడం అన్యాయమన్నారు. జీతాలు నెలనెలా ఇవ్వకపోతే ఎలా బతకాలని ప్రశ్నించారు. దూర ప్రాంతాల నుంచి పనికి తెల్లవారకముందే వస్తున్నామని, ప్రయాణ ఖర్చులు విపరీతంగా పెరగడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికుల ఆర్థిక ఇబ్బందులు అర్థం చేసుకుని జీతాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై జోనల్ కమిషనర్ స్పందిస్తూ జీతాలు వెంటనే వేయించే ఏర్పాటు చేస్తామని హామీచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ కార్యదర్శి ఎంవి.ప్రసాద్, సిఐటియు నాయకులు నరేంద్ర కుమార్, కార్యకర్తలు ఎస్.గౌరి, జె.దేవి, ఎం.సురేష్, సిహెచ్.రాము, వై.సంతోషి, డి.లక్ష్మీనారాయణ, ఎం.నర్సింగ్ పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న కాంట్రాక్టు, డైలీ వేజ్ కార్మికులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ గొలగాని తదితరులు

సినీ సంగీత విభావరి పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న ముగ్గురు గాయనీమణులతో 'వేణు గానమ్ము వినిపించెనే' శీర్షికన తలపెట్టిన సినీ సంగీత విభావరి పోస్టర్‌ను నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆవిష్కరించారు. సోమవారం ఉదయం జివిఎంసి ప్రధాన కార్యాలయంలోని మేయర్ చాంబర్‌లో ఏర్పాటైన ఈ కార్యక్రమంలో ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు మాట్లాడుతూ ఈ నెల 20న సాయంత్రం 4 గంటల నుండి అక్కయ్య పాలెం దాలిరాజు సూపర్ మార్కెట్ పక్కన ఉన్న స్వరాలయ స్టూడియోలో నిర్వహించనున్న వేణు గానమ్ము వినిపించెనే సినీ సంగీత విభావరిలో ప్రముఖ గాయనీమణులు కోమలీ ప్రసాద్, సుజాత కంఠ, ఎం.మాధురిలతో కలిసి రమేష్ పట్నాయక్, వికె.రాజు, మనోహర్, దేవరాజ్, సత్య, విశ్వ ప్రసాద్ పలు చిత్ర గీతాలు ఆలపించనున్నారన్నారు. సెంచూరియన్ వైస్ చాన్సలర్ ఆచార్య జిఎస్ఎన్.రాజు, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షులు బొమ్మిడి సత్యనారాయణ, గాయకులు కోమలి ప్రసాద్, విశ్వ ప్రసాద్, సుజాత కంఠ పాల్గొన్నారు.

గెలుపొందిన విద్యార్థులతో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్

సెయింట్ ఆన్స్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -భీమునిపట్నం : విశాఖ నగరంలోని సెయింట్ ఆన్స్ స్కూల్ వేదికగా నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో తమ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానంలో నిలిచి ప్రతిభ కనబరిచినట్లు స్థానిక సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరెస్పాండెంట్ త్రిసా మేరీ, ప్రిన్సిపల్ క్రిష్టిజన్ సోమవారం తెలిపారు. నగరంలోని 12 పాఠశాలల విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు. వర్షపు నీరు వృథా కాకుండా ఎలా నిల్వ చేసుకోవచ్చు, పంటలకు ఎలా మళ్లించవచ్చు అనే అంశంపై తమ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నమూనాకు రెండో బహుమతి లభించిందని తెలిపారు. విజేతలైన విద్యార్థులను పాఠశాలలో అభినందించారు.

శిక్షణా తరగతుల్లో విద్యార్థులు

జిమ్సర్‌లో యాంటీమైక్రోబియల్‌పై అవగాహన

యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్‌పై అవగాహనలో ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) ఆధ్వర్యాన సోమవారం యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎంఆర్) అవగాహన వారోత్సవాలను ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వసంతకుమార్ ప్రారంభించారు. ప్రపంచ వ్యాప్తంగా ఏటా 70 లక్షల మందికి పైగా జనాభా ఎఎంఆర్ బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన తెలిపారు. యాంటీబయాటిక్స్‌ను అవసరానికి మించి వినియోగించడం వల్ల ఎఎంఆర్ మహమ్మారి విజృంభిస్తుందని వివరించారు. ప్రజారోగ్యం దృష్ట్యా యాంటిబయాటిక్స్‌ను బాధ్యతగా ఉపయోగించాల్సి ఉందన్నారు. ఎఎంఆర్ సమస్యపై ప్రజలను, ఆరోగ్య కార్యకర్తలకు చైతన్యం కలిగించడానికి అవగాహన వారోత్సవాలు ఉపయోగపడతాయని చెప్పారు. కార్యక్రమంలో జిమ్సర్ ఫార్మకాలజీ విభాగం అధిపతి డాక్టర్ టి.తులసి మాధురి, వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ జి.చైతన్య, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాలు అందజేస్తున్న ఎల్లాజీ

నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి మూడో వార్డు పరిధి బోయివీధికి చెందిన పలువురు పేద విద్యార్థులకు సోమవారం అదే వీధికి చెందిన కొంత మంది యువకులు నోటు పుస్తకాలు, ఆట వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానికులు కాసరపు ఎల్లాజి, అరసవిల్లి అనిల్ కుమార్, బీచ్ ఫొటోగ్రాఫర్ల సంఘం అధ్యక్షులు కాసరపు శివ, కార్యదర్శి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

ప్రజాశక్తి- భీమునిపట్నం : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలపై స్థానిక యుసిడి విభాగం ఆధ్వర్యాన సోమవారం జోనల్ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సభ్యులకు అధికారులు అవగాహన కల్పించారు. పిఎం జీవన్ జ్యోతి, సురక్ష బీమా యోజన, జన్‌ధన్ యోజన తదితర పథకాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని జోనల్ కమిషనర్ పిల్లి ప్రేమ ప్రసన్న వాణి సూచించారు. అనంతరం 33 మంది లబ్ధిదారులకు వివిధ పథకాల కింద రుణ మంజూరు పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో యుసిడి పిఒ డి.లక్ష్మి, డిపిఒ కె.కనకమహాలక్ష్మి, ఎస్‌బిఐ స్థానిక బ్రాంచి ఫీల్డ్ ఆఫీసర్ విద్యాసాగర్, యుసిడి ఎపిడి దొర తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు రుణ మంజూరు పత్రాలు అందజేస్తున్న పిఒ, డిపిఒలు

ఎన్ఎంఎంఎస్ శిక్షణా కేంద్రాన్ని సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జెడ్పీ హైస్కూల్‌లో ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన ఎన్ఎంఎంఎస్ విద్యార్థుల ఉచిత శిక్షణ కేంద్రాన్ని ఎంఇఒ ఎం.శివరాణి సోమవారం సందర్శించారు. శిక్షణ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం పొట్నూరు మురళీమోహనరావు, సొసైటీ వ్యవస్థాపకులు గంటాన మోహనరావు, ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాములకు అన్నప్రసాదం

ప్రజాశక్తి-సీతమ్మధార : రేసపువానిపాలెం శాంతి స్వరూపిణి దుర్గాదేవి ఆలయం వద్ద కెఎస్ఎన్ఎస్ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యాన అయ్యప్ప స్వాములకు అన్నప్రసాదం ఏర్పాటుచేశారు. ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు సోమవారం హాజరై స్వాములకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో సాడి పద్మారెడ్డి, కె.అనిల్‌కుమార్ రాజు పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మధురవాడ ప్రాంతంలో ధర్నా చేస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి -యంత్రాంగం

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా సోమవారం పలుచోట్ల ధర్నాలు నిర్వహించారు.

గాజువాక : కొత్త గాజువాక హెచ్‌పి పెట్రోల్ బంకు సమీపంలోని సచివాలయం వద్ద సిపిఐ ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, కెంగువ అచ్యుతరావు మాట్లాడుతూ, నియోజకవర్గంలో జీవో నెంబర్ 301, 296, 44 ప్రకారం 100 గజాల లోపు పట్టాలు పొందిన వారందరికీ రిజిస్ట్రేషన్, తనఖా పెట్టుకోవడానికి హక్కు కల్పిస్తూ పట్టాదారులకు ఎన్ఒసి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపూడి దుర్గారావు, కె.వనజాక్షి, పి.పోతన్న, కె.పద్మ, వై.దేములు, లోకేష్, శ్రీనివాస్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడ శివశక్తినగర్ నుంచి బొట్టవానిపాలెం సచివాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం వెల్ఫేర్ కార్యదర్శి రజనికి వ్యక్తిగత దరఖాస్తులు అందజేశారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు పేదలకు పట్టణాలలో 2 సెంట్లు, గ్రామాలలో 3 సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, నిర్మాణం కోసం రూ.5 లక్షలు రూపాయలు మంజూరు చెయ్యాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వి.సత్యనారాయణ, ఎమ్‌డి బేగం, బి.కేశవయ్య, ఎస్‌కె.సల్మా, కె.కుమార్ పాల్గొన్నారు.

వడ్డాది : టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీ మేరకు పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బాలిపల్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. బుచ్చయ్యపేట మండలం వడ్డాది సచివాలయం వద్ద సచివాలయ సిబ్బందికి వినతిపత్రం సోమవారం అందించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెడ్డిపల్లి అప్పలరాజు, వర్రి సూరిబాబు, రావాడ వరహాలు, రావాడ మల్లాడి, రావాడ సూరిబాబు, గనివాడ రాము పాల్గొన్నారు.

అనకాపల్లి : అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సిపిఐ ఆధ్వర్యాన సోమవారం జీవీఎంసీ అనకాపల్లి జోన్ పరిధిలోని 6, 7, 8 సచివాలయాల వద్ద ధర్నాలు నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వై.ఎన్.భద్రం, కోరుబిల్లి శంకర్రావు, శ్రీరామదాసు అబ్బులు, కరణం మాణిక్యాలరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని దాలివలసలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఐ ఆధ్వర్యాన గ్రామ సచివాలయ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి గొర్లె దేవుడు బాబు, రెడ్డి అప్పలనాయుడు, దమ్ము ముత్యాల నాయుడు, ఇల్లాకు రాము పాల్గొన్నారు.

గొలుగొండ : అర్హులకు ఇళ్లస్థలాలు, ఇళ్ల నిర్మాణానికి రూ.ఐదు లక్షల ఆర్థికసాయం ఇవ్వాలనికోరుతూ సోమవారం సిపిఐ, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాతకృష్ణదేవిపేట సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు మండల కార్యదర్శి మేకా భాస్కరరావు, శాఖ కార్యదర్శి సాపిరెడ్డి బాబ్జి పాల్గొన్నారు.

జోరుగా అక్రమ నిర్మాణాలు

పట్టని టౌన్ ప్లానింగ్ అధికారులు

ప్రజాశక్తి- సీతమ్మధార: జివిఎంసి 25వ వార్డు పరిధిలో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడం పలు విమర్శలకు దారితీస్తోంది. జోన్ 3 పరిధి 25వ వార్డులో 50-90-7 డోర్ నెంబర్ ఇంటికి జి ప్లస్ త్రీ అనుమతులు తీసుకున్నారు. ఈ ఇంటికి రోడ్డు మార్గం ఐదు అడుగులు మాత్రమే ఉంది. కానీ ప్లాన్ కాపీలో 40 అడుగుల రోడ్డు చూపించి జి ప్లస్ త్రీ అనుమతులు తీసుకున్నారు. టౌన్ ప్లానింగ్ సిబ్బంది కళ్ళు మూసుకొని ప్లాన్ మంజూరు చేశారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే కనీసం అంబులెన్స్ గానీ, ఫైర్ ఇంజిన్ గాని వెళ్లలేని పరిస్థితి ఉంది. ప్లాన్ రోడ్డు మార్గం తప్పు చూపించి నిర్మాణం సాగిస్తున్నారు. దీనిపై పలుమార్లు జివిఎంసికి ఫిర్యాదులు అందినా పట్టించుకోవడం లేదు.

25వ వార్డు శానిటరీ బిల్డింగ్ ఎదురుగా మరో వ్యక్తి జి ప్లస్ టు అనుమతులు తీసుకుని అదనంగా మరో అంతస్తు నిర్మించారు. దీనిపై ఫిర్యాదులు చేస్తే ఒక ఎమ్మెల్యే సిఫారసు ఉందని ఆ భవనం వైపు అధికారులు కన్నెత్తి చూడలేదు. 50-84-10/ఎ డోర్ నెంబర్‌లో ఎటువంటి అనుమతి లేకుండా నిర్మాణం చేస్తున్నారు. దీనిపై కూడా ఫిర్యాదులు వెళ్లినా అధికారులు పట్టించుకోలేదు. దీనిపై ప్లానింగ్ సెక్రటరీ కృష్ణను వివరణ కోరగా జివిఎంసి సిబ్బంది, కమిషనర్ తనకు తెలుసని నిర్మాణదారుడు సమాధానమిస్తున్నాడని అధికారి చెబుతున్నారు. దీంతో నిర్మాణం వైపు అధికారులు కనీసం చూడటంలేదు. అక్రమ నిర్మాణాలపై జోన్- 3 ఎసిపి మధుసూదన్‌బాబును వివరణ కోరగా నిర్మాణాలపై ఫిర్యాదులు వచ్చాయని, పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

అపార్ సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి-సీతమ్మధార : దేశ వ్యాప్తంగా కేజీ నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకు ఆటోమేటిక్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్) పేరిట జారీ చేస్తున్న కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో సమస్యల పరిష్కారానికి అధికారులు త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. ఆధార్ కార్డుల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల పేర్లు తప్పులు, స్కూల్ రికార్డులలో జన్మ దిన తేదీల మార్పులు, చిన్నపాటి అక్షర దోషాలు, గ్రామ, నగర పంచాయతీలు, పురపాలక సంఘాలు, నగర పాలక, మహా నగరపాలక సంస్థల్లో నమోదై ఉన్న జనన ధ్రువీకరణ పత్రాలలో విద్యార్థుల పూర్తి పేర్లు నమోదు కాకపోవడం తదితర సమస్యలు, సరిచేసేందుకు విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు ఆయా జిల్లాల్లో ఆధార్ కేంద్రాలు అందుబాటులో లేక విద్యార్థులు, తల్లిదండ్రుల తీవ్ర అవస్థలు పడుతున్నట్లు కమిషన్‌కు ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు.

బాక్సింగ్ పోటీల విజేతలకు అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్ర యూనివర్సిటీ అంతర్ కళాశాల బాక్సింగ్ మహిళల పురుషుల చాంపియన్‌షిప్ పోటీల విజేతలను బుల్లయ్య కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్ అభినందించారు. ఈ నెల 15, 16 తేదీల్లో ఆంధ్ర యూనివర్సిటీ బాక్సింగ్ హాల్‌లో నిర్వహించిన పోటీల్లో డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు పురుషుల బాక్సింగ్‌లో టీం ఛాంపియన్‌షిప్‌ను, బుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు మహిళల బాక్సింగ్ పోటీలలో టీం ఛాంపియన్ షిప్‌ను గెలుపొందారు. మహిళల బాక్సింగ్ పోటీలలో సిఎస్‌సి ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎస్‌జిఎస్.మల్లిక 52 కేజీల విభాగంలో బెస్ట్ బాక్సర్‌గా టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. బిఎ ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎమ్‌డి హీన కౌసర్ బెస్ట్ లూజర్ టైటిల్‌ను గెలుచుకున్నారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో విద్యార్థినీ, విద్యార్థులను ప్రిన్సిపల్ డాక్టర్ జిఎస్‌కె చక్రవర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డి.దీపక్‌చౌదరి, వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్లు డాక్టర్ బిఆర్ఎస్.లక్ష్మణరెడ్డి, యు.గంగాభవాని, మేజర్ టి.బ్రహ్మానందరెడ్డి అభినందించారు.

వరప్రసాద్‌ను సత్కరిస్తున్న మాధవధార జర్నలిస్టుల అసోసియేషన్ ప్రతినిధులు

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-మాధవధార : కళింగ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఇటీవల నియమితులైన సనపల వరప్రసాద్‌ను మాధవధార జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు సోమవారం ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వరప్రసాద్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేస్తానని హామీఇచ్చారు.

నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు కొండవాలు ప్రాంతాలైన సాయిరాం కాలనీలో మెట్ల మార్గాలు, రోడ్లు, కాలువలు పనులకు సోమవారం కార్పొరేటర్ మొల్లి హేమలత భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కొండవాలు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు తాగునీరు, రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, మెట్లమార్గాలు లేక చాలా ఇబ్బందులు పడడాన్ని ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. వాటి పరిష్కారానికి గత ప్రభుత్వంలో చాల సార్లు జివిఎంసి కౌన్సిల్ సమావేశాల్లో మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులకు మోక్షం కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు నమ్మి శ్రీను, మహిళా అధ్యక్షులు బోయి రమాదేవి, జనసేన అధ్యక్షుడు దేవర శివ, ఒలేటి శ్రావణ్, టిడిపి నాయకులు బొడ్డేపల్లి రంగారావు, కర్మోజు గోవిందరావు, ఆవాల నేలయ్య, వైకుంఠరావు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ హేమలత

ప్రభుత్వ స్థలం కబ్జాపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్‌లో ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు, స్థానిక కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుకు, గాజువాక తహశీల్దార్‌కు సోమవారం గ్రామ కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. సామాజిక భవనానికి కేటాయించిన స్థలాన్ని దాసరి ఉమా, వారి కుటుంబ సభ్యులు కబ్జా చేశారని వివరించారు. కబ్జాదారుల నుంచి స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని మహిళా సామాజిక భవనం నిర్మించాలని కోరారు. కాలనీ ఏర్పాటు సమయంలో మహిళా సామాజిక భవనం నిర్మించాలని 60 గజాలు స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఆ స్థలం పక్కనే ఉన్న దాసరి ఉమ, వారి కుటుంబ సభ్యులు ఈ స్థలాన్ని వాడుకుంటూ ఇప్పుడు తమది అని అంటున్నారని పేర్కొన్నారు. గ్రామంలో డ్వాక్రా 39 గ్రూపుల్లో 390 మంది మహిళా సభ్యులు ఉన్నారని, వీరు ప్రతినెలా జరిపే సమావేశాలకు ఇబ్బందికరంగా ఉంటుందని, దయచేసి ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని మహిళా సామాజిక భవనాన్ని నిర్మించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కమిటీ గౌరవాధ్యక్షులు భాస్కరరావు, కార్యదర్శి డి.రమణ, వైస్ ప్రెసిడెంట్ ఎస్.రమేష్, కోశాధికారి జి.కమలాకరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.రమణ ఉన్నారు.

తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ నాయకులు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 వినతులు

ప్రజాశక్తి-వేపగుంట : జోన్ -8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 14 వినతులు వచ్చినట్లు జోనల్ కమిషనర్ హేమలత తెలిపారు. వినతులను సంబంధిత అధికారులకు పంపించామని పేర్కొన్నారు

ఐదో రోజుకు రిలే దీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మత్స్యకార ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యాన జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు సోమవారం నాటికి ఐదో రోజుకు చేరుకున్నాయి. కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆర్‌డిఒ కె.సంగీత్‌మాధుర్‌కు కమిటీ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు గంటా నూకరాజు, పి.అప్పారావు, కారి అప్పారావు, అల్లిపిల్లి నరసింగరావు, వాసుపల్లి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

రామ్మూర్తినాయుడుకు నివాళి

ప్రజాశక్తి -భీమునిపట్నం : ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, చంద్రగిరి నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తినాయుడు మృతి పట్ల స్థానిక పార్టీ నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, ఎం.సంజీవ్‌కుమార్, పోలిరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న అధికారులు

అక్రమ కట్టడాలు కూల్చివేత

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని శిర్లపాలెం గ్రామం సర్వేనెంబర్ 27లో అక్రమంగా నిర్మించిన షెడ్లను సోమవారం తొలగించారు. గ్రామానికి ఆనుకొని ఉన్న చెరువు పక్కనే కొంతమంది షెడ్లు నిర్మించారని వచ్చిన ఫిర్యాదు మేరకు తహశీల్దార్ శ్యామ్‌ప్రసాద్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఉమాదేవి, విఆర్‌ఒ అప్పారావు సోమవారం పరిశీలించారు. అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాల్లో ఎవరైనా అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గీతంలో గాయని సునీత సందడి

గాయని సునీతను సన్మానిస్తున్న గీతం సిబ్బంది

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో సోమవారం ప్రముఖ సినీ నేపథ్యగాయిని సునీత తన స్వరాలతో సందడి చేశారు. గీతం హ్యుమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సునీత పాల్గొన్నారు. యువత చదువుతో పాటు సంగీతం, నృత్యం, చిత్రకళలలో ఏదో ఒక దానిలో ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. గీతంలో ప్రవేశం పొందే విద్యార్థులకు సంగీతంతో సహా ఇతర భారతీయ కళలపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. విద్యార్థుల ఒత్తిడిని దూరం చేసుకోవడానికి ఇవి ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు పాటలను పాడి వినిపించారు. అనంతరం సునీతను గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గౌతమ్‌రావు సన్మానించారు. కార్యక్రమంలో గీతం హ్యుమానిటీస్, సోషల్‌సైన్సెస్ ఫ్యాకల్టీ సభ్యులు సుస్మారాజు, డాక్టర్ పి.ఆశ తదితరులు పాల్గొన్నారు.

విసిసి ఆటల పోటీల విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి -మధురవాడ : వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్, రోటరీ క్లబ్, ఆసరా చారిటబుల్ ఆధ్వర్యాన నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. మధురవాడ జోన్‌లోని పరదేశిపాలెం, శారదానగర్, పిఠాని కాలనీ, వైఎస్ఆర్.కాలనీ -1, 2లు, డ్రైవర్స్ కాలనీ, స్వయంకృషి నగర్, అయ్యప్పనగర్, స్వయంకృషి నగర్-2, ఎస్‌సి కాలనీ, కొమ్మాది విలేజ్, అమరావతి కాలనీ, కేటు కాలనీ, బాంబే కాలనీ- 1, 2, స్వతంత్ర నగర్, పవన్‌మిత్ర అపార్ట్‌మెంట్ తదితర ప్రాంతాల్లో పిల్లలకు పరుగు, కబడ్డీ, ఖోఖో, మ్యూజికల్ చైర్, వ్యాసరచన, క్విజ్, డ్రాయింగ్, చెస్, గ్లాస్ బెలూన్ పోటీలు నిర్వహించారు. 456 మంది పిల్లలు పోటీల్లో పాల్గొన్నారు. జోన్ కన్వీనర్ డి.కొండమ్మ, ఉమామహేశ, ఏరియా టీమ్ లీడర్లు నందిని, భారతి, సుజాత, పుష్ప, విజ్జ, ప్రసన్న, వాసవి, ఉష, ఈశ్వరి, భవాని, పద్మ, రాజు, స్టాలిన్, రాములమ్మ, చాముండేశ్వరి, మంగశ్రీ, దివ్య, కరుణ, సంధ్య టీమ్ లీడర్లు పిల్లలకి విజ్ఞానం వినోదం వికాసం ఉండాలని పోటీల్లో ప్రోత్సహించారు.

మెమెంటోలు, సర్టిఫికెట్లతో విజేతలు

సమస్యలపై 108 ఉద్యోగుల నిరాహార దీక్షలు

25 తరువాత ఏ క్షణమైనా సమ్మె



అనకాపల్లిలో నిరాహార దీక్షలు చేస్తున్న 108 ఉద్యోగులు

ప్రజాశక్తి-అనకాపల్లి

108 అంబులెన్స్ వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, ఇందులో పని చేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 108 ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకరరావు, ఏపి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వివి శ్రీనివాసరావు 108 ఉద్యోగులకు పూలదండలు వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు ఆదాయాన్ని కట్టబెట్టే విధంగా నిర్ణయం చేయడంతో పాటు గతంలో ఉండే ఉద్యోగుల బెనిఫిట్స్ కూడా తగ్గించిందని పేర్కొన్నారు. 108 సర్వీస్‌లో 15 ఏళ్లుగా చేస్తున్న వారికి కనీసం ఉద్యోగ భద్రత లేదని, గతం నుంచి రావలసిన ఇంక్రిమెంట్లు ఏరియర్స్ నేటికీ చెల్లించలేదని తెలిపారు. 108 ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, మూడు షిఫ్ట్‌ల్లో 8గంటల పనివిధానం అమలు చెయ్యాలని, ప్రస్తుత నిర్వహణ సంస్థ నుండి ఉద్యోగులకు రావల్సిన బకాయిలను పూర్తిగా చెల్లించే బాధ్యతను ప్రభుత్వమే చేపట్టాలని డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వమైన 108 ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందించాని, లేకుంటే ఈ నెల 25 తర్వాత సమ్మెలోకి వెళ్లాల్సిన వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు శ్రీరామూర్తి, కోటేశ్వరరావు, జిటిఎస్ ప్రసాద్, జి సంజీవరావు, సీతారాం, భవానీ, జివిఎస్.మూర్తి, డి.రాజు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర వ్యాప్తంగా పిలుపులో భాగంగా సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 108 ఎంప్లాయిస్ యూనియన్ విశాఖపట్నం యూనిట్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా కార్యదర్శి బి.జగన్ మాట్లాడుతూ అధికారులిచ్చిన హామీ ప్రకారం స్లాబ్ ప్రకారం అందరికీ వేతనాలు చెల్లించాలని, సర్వీసును బట్టి ఎప్పటికప్పుడు స్లాబ్‌ను అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. వైద్య, ఆరోగ్య శాఖలోని ఇఎంటి పోస్టుల్లో 108 ఇఎంటిలను నియమించాలని, పైలెట్లు ఇఎంటిలను ఇతర ఖాళీల్లోనూ వారి వారి అర్హతలను బట్టి వెయిటేజ్ ఇచ్చి నియమించాలని, పైలెట్లను ఆర్టీసీలో డ్రైవర్లుగా వెయిటేజ్ ఇచ్చి నియమించాలని డిమాండ్ చేశారు. సహజమరణం, ప్రమాదాల్లో చనిపోయిన ఉద్యోగులకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. గత టిడిపి ప్రభుత్వంలో ఇచ్చిన జిఓ 49 ప్రకారం అమలు చేసిన నెలకు రూ.4 వేలను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. 108 సేవల్లో ప్రస్తుతం ఉన్న ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలని, 108 వాహనాలకు శాశ్వత భవనాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సలహాదారు బి.శ్రీనివాస్, అధ్యక్షులు ఎస్.బంగార్రాజు, కోశాధికారి డి.సురేష్, డివిజనల్ కార్యదర్శి టి.వాసుదేవరావు, సిహెచ్ సింహాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద..

రైతులు ఆమోదం లేకుండా విద్యుత్ లైన్ ఏర్పాటు

ఎఇపై చర్యలు తీసుకోవాలని రైతుల డిమాండ్

ప్రజాశక్తి-కె.కోటపాడు

మండలంలోని సూరెడ్డిపాలెం గ్రామంలో రైతుల అనుమతి లేకుండా దొంగ చాటుగా విద్యుత్ లైన్ వేసిన విద్యుత్ శాఖ ఎఇపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కె.కోటపాడు విద్యుత్ శాఖ కార్యాలయంలో సోమవారం రైతులు వినతిపత్రం గోడకు అంటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం రైతులు ఎవరూ లేని సమయంలో విద్యుత్ శాఖ అధికారులు కరెంటు వైర్లు బిగించి వెళ్ళిపోయారని, దీనిపై ఫిర్యాదు చేయడానికి మధ్యాహ్నం 3 గంటలకు వెళితే ఆఫీసులు ఏఈ లేరని పేర్కొన్నారు. రైతుల బాధను రాసి ఇద్దామంటే సాయంత్రం ఐదు గంటలకు తలుపులు వేసుకున్నారని, దీంతో దిక్కుతోచక విద్యుత్ శాఖ కార్యాలయానికి ఫిర్యాదు అంటించినట్లు చెప్పారు. ఈ కరెంటు లైన్‌ను వెంటనే తీసివేయాలని, చట్ట ప్రకారం అధికారులు నడుచుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో రొంగలి దేవుడు నాయుడు, సబ్బవరపు ముత్యాల నాయుడు, వేముల దేవుని నాయుడు, సూరెడ్డి శ్రీను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ ఆఫీసులో ఫిర్యాదు అంటిస్తున్న రైతులు

ముగిసిన బాలల సాంస్కృతిక ఉత్సవాలు

మ్యాజిక్ షో నిర్వహిస్తున్న రవి శంకర్

ప్రజాశక్తి-మునగపాక

మండలంలోని గవర్ల అనకాపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రం గ్రంథాలయం ఆధ్వర్యాన నిర్వహించిన బాలల సాంస్కృక ఉత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో అతిథులు ముందుగా తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, దక్షిణ భారత దేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు, ప్రముఖ మెజీషియన్ రవిశంకర్ మ్యాజిక్ షో, ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ రాజబాబు మిమిక్రీ షో అలరించాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించి, ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. నేటి విద్యార్థులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో తల్లిదండ్రులు ప్రోత్సాహకాలు ఇవ్వాలన్నారు. సమాజంలో జరుగుతున్న పరిణామాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే విధంగా గ్రంథాలయాలకు వెళ్లి చదివే అలవాటు చేయాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు ఆళ్ల మహేశ్వరరావు, కాండ్రేగుల రాము, కోయిలాడా వెంకట్, ధొడ్డి కోటేశ్వరరావు, దాడి శ్రీనివాసరావు, రాపేటి పరమేశ్వరావు, పి.భాగేశ్వరరావు, ప్రసాద్, ఆళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన దృశ్యం

అసెంబ్లీలో మాట్లాడుతున్న చోడవరం ఎమ్మెల్యే రాజు

చోడవరం సుగర్స్‌కు నిధులిచ్చి ఆదుకోవాలి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం చక్కర కర్మాగారానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని చోడవరం శాసనసభ్యులు కెఎస్ఎన్ఎస్ రాజు సోమవారం అసెంబ్లీలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే చోడవరం చక్కర కర్మాగారానికి ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉండేవని, ఆర్థిక స్థితిగతులు బాగుండేదని తెలిపారు. కాలక్రమేనా నష్టాలు రావడంతో ఫ్యాక్టరీ మనుగడ కష్టంగా మారిందన్నారు. తక్షణమే ఫ్యాక్టరీకు అనుబంధంగా డిక్షనరీ పరిశ్రమ ఏర్పాటు చేసి 25 వేల మంది రైతులు, రెండు వేల మంది కార్మికులు జీవితాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రూ.80 లక్షలతో బిటి రోడ్డు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలం కొత్తూరు ఎఎంఎఎల్ కాలేజ్ బ్రిడ్జి నుంచి శారదనగర్ వరకు గుంతలు పడిన రోడ్లను 80 లక్షల రూపాయలతో బిటి రోడ్డు చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్టు టిడిపి కూటమి నాయకుడు తెలిపారు. గుంతలు లేని ఆంధ్రప్రదేశ్ రోడ్లు కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జి భీమరశెట్టి రాంకీ సూచనలతో రోడ్లకు మరమ్మతుల పనుల ప్రారంభమైనట్లు పేర్కొన్నారు. ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ వారు ఈ 80 లక్షల రూపాయల పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి భరత్ బాబు, తుమ్మపాల ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, టిడిపి కూటమి నాయకులు మేడిశెట్టి సత్తిబాబు, మేడిశెట్టి నూకరాజు, కోన శ్రీనివాసరావు, జ్యోతుల గణేష్, పందల సత్యగోవింద్, తిమ్మపాత్రుని ప్రవీణ్, బర్ల నాగరాజు, మద్దాల నారాయణరావు, గొల్లవిల్లి రాజు, మోసూరి నర్సింగ్, పల్లి నాగ సుబ్బారావు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు భరత్ పరామర్శ

ప్రజాశక్తి-అనకాపల్లి : కార్తీక పౌర్ణమి రోజు ఈనెల 15న అనకాపల్లి చినరాజుపేట శ్రీచౌడేశ్వర సాంబమూర్తి దేవాలయం జ్వాలా తోరణం మంటల వల్ల గాయపడిన క్షతగాత్రులను ఎన్టీఆర్ జిల్లా వైద్యాలయంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్ కుమార్ సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా భరత్ కుమార్ మాట్లాడుతూ గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. క్షతగాత్రులకు ఆసుపత్రి పరిధిలో అందుబాటులో లేని మెడిసిన్‌ను సమాకురుస్తామని వైద్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకిరామరాజు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, నాయకులు బొడ్డేడ శివ, కెఎం నాయుడు, మలసాల కిషోర్, కలగా గున్నయ్య నాయుడు, దాడి నారాయణరావు, గొల్లవిల్లి శ్రీనివాసరావు, పెంటకోట శ్రీను, బుద్ధ నరసింహారాజు, పెంటకోట శ్రీను, మలసాల కుమార్ రాజా, గైపూరి రాజు, గాడి మాధురి నాయుడు, ఏడువాకుల నారాయణరావు, వెలుగుల కృష్ణ చైతన్య, డానీ పాల్గొన్నారు.

విఆర్ఎల గృహ నిర్బంధం సరికాదు

ప్రజాశక్తి -అనకాపల్లి : గ్రామ రెవిన్యూ సహాయకుల (వీఆర్ఏ) డిమాండ్లపై రాష్ట్ర వ్యాప్తంగా విజయవాడలో శాంతియుత నిరసన కార్యక్రమానికి వెళుతున్న వీఆర్ఏలను జిల్లాలోని పోలీసు యంత్రాంగం అక్రమంగా నిర్బంధించడాన్ని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఆర్ శంకర్‌రావు, జి కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఏళ్ల తరబడి పని చేస్తున్న వీఆర్ఏలకు ఉద్యోగ భద్రత లేక కనీస వేతనాలు అమలు కాక నెలవారి జీతాలు కూడా అందని పరిస్థితిల్లో నేడు విజయవాడలో ధర్నా నిర్వహించడం కోసం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. దీనికి జిల్లా నుండి విజయవాడ వెళుతున్న వీఆర్ఏలను పోలీసులు అక్రమంగా నిర్బంధించి పోలీస్ స్టేషన్లో తరలించారని, అచ్చుతాపురం మండలం హరిపాలెం పోలీసులు నిర్బంధం ప్రయోగించారని పేర్కొన్నారు. శాంతియుత ఉద్యమాలపై కూటమి ప్రభుత్వం నిర్బంధ కాండ ప్రయోగించడం దుర్మార్గమన్నారు.

మండల, వార్డు స్థాయిలో పిజిఆర్ఎస్ అమలు

ప్రజాశక్తి-అనకాపల్లి

మండల, వార్డు స్థాయిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జాయింటు కలెక్టర్ ఎం.జాహ్నవి, కెఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్‌విఎస్.సుబ్బలక్ష్మి, హౌసింగు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ అర్జీల గూర్చి సంబంధిత జిల్లా, మండల స్థాయి అధికారులతో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కారం చూపాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ, మండల స్థాయిలో పరిష్కారం కావలసిన సమస్యల గురించి కూడా ప్రజలు జిల్లా కార్యాలయానికి వస్తున్నారని, అందువలన ప్రజలకు డబ్బు, సమయం వృధా అవుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి సోమవారం జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రాలలో తహశీల్దార్, ఎంపిడిఒ కార్యాలయాల వద్ద ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార కార్యక్రమం నిర్వహించే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని, గ్రామ స్థాయిలో ప్రచారం చేయాలని కోరారు. మండల కార్యాలయంలో అందజేసిన ప్రతి దరఖాస్తుపై చర్యలు తీసుకోవడం తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పోలీసు కార్యాలయం 40 అర్జీలు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చే ఫిర్యాదుదారులు ఆధార్ కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 40 ఫిర్యాదులు వచ్చాయి. వాటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, చీటింగ్ తదితర ఫిర్యాదులు ఉన్నాయి. వాటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని తుహిన్ సిన్హా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం.దేవ ప్రసాద్, ఎస్సై వెంకన్న పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్, జెసి తదితరులు

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు

ఆక్రమణ భూమిని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ ఆయిషా

ప్రజాశక్తి-సబ్బవరం

ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు పెడతామని అనకాపల్లి ఆర్డీఓ షేక్ ఆయిషా హెచ్చరించారు. మండలంలోని బాట జంగాలపాలెం రెవెన్యూలో పరిధిలోని సర్వే నెంబర్ 185లో సుమారు 5.37 సెంట్లు ప్రభుత్వ వాగు పోరంబోకు భూమిని గుర్తు తెలియని వ్యక్తి ఆక్రమణ చేసి కొబ్బరి, నీలగిరి, ఎర్ర చందనం మొక్కలు నాటారు. దీనిపై గ్రామస్తులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆర్‌డిఓ సోమవారం కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. ఆ భూమిలో మొక్కలను తొలగించి భూమిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సబ్బవరం సర్వే నెంబర్ 260/4 ప్రభుత్వ గెడ్డ వాగు పోరంబోకులో ఓ వ్యక్తి అక్రమ నిర్మాణం చేసారని, దానిని రెవెన్యూ సిబ్బంది గుర్తించి గతంలో తొలగించారని, అయినప్పటికీ ఆక్రమణదారుడు మళ్ళీ అక్రమ నిర్మాణం ప్రారంభించడంతో దానిని పరిశీలించి, కబ్జాదారునిపై ల్యాండ్ గ్రాబింగ్ క్రిమినల్ కేసులు పెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వ భూములను దురాక్రమణ చేసినా, అక్రమ నిర్మాణాలు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ బి. చిన్ని కృష్ణ, ఆర్ఐ వీరయ్య, మండల సర్వేయర్ అప్పారావు, వీఆర్వో, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులకు ఓటు హక్కు కల్పించాలి

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని ఇరువాడ పంచాయతీ బోనువాని చెరువు సాగునీటి సంఘం ఎన్నికల ఓటరు జాబితాలో తమ పేర్లు చేర్పించాలని టిడిపి అనకాపల్లి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి రేసుపూడి రమణ ఆధ్వర్యాన ఆయకట్టు రైతులు కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సోమవారం విన్నవించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ ఇరువాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 183, 186, 38లలో ఆయకట్టు రైతులకు సాగునీటి సంఘం ఓటర్ల జాబితాలో 100 మంది పేర్లను చేర్చకుండా రెవిన్యూ, ఇరిగేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలిపారు. దీనిపై తక్షణమే అధికారులు స్పందించి ఆయా రైతులకు సాగునీటి సంఘం ఎన్నికలలో ఓటు హక్కు కల్పించాలని కోరారు.

వికలాంగులకు పెట్రోల్/డీజిల్ సబ్సిడీకి దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : సొంతంగా వ్యాపారం చేసుకుంటూ లేదా గుర్తింపు పొందిన ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తూ సొంతంగా మోటరైజ్డ్ మూడుచక్రముల వాహనం కలిగిన వికలాంగులు పెట్రోల్ / డీజిల్ సబ్సిడీ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, సహాయ సంచాలకులు జివిబి.జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారంతో పాటు సదరం సర్టిఫికేట్, రేషన్ కార్డు (బియ్యం కార్డు), బ్యాంకు పాస్ పుస్తకము (మొదటి పేజి), ఆధారు కార్డు, వ్యాపారము లేదా ఏదేని సంస్థ నందు పనిచేస్తున్నట్లు ధ్రువీకరణ పత్రము, డ్రైవింగ్ లైసెన్సు, వాహన రిజిస్ట్రేషన్ పత్రము పత్రాలు జతచేయాలని కోరారు. నిర్ణీత దరఖాస్తు ఫారం పూరించి సహాయ సంచాలకులు, విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయానికి నవంబరు 25వ తేదీ లోగా అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు సహాయ సంచాలకులు, విభిన్నప్రతిభావంతులు, హిజ్రాలు మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, ఎన్.టి.ఆర్. ఆసుపత్రి ప్రాంగణము, అనకాపల్లి జిల్లా కార్యాలయమును ఫోన్ నెంబర్ 8801105906 ద్వారా సంప్రదించాలని కోరారు.

కలెక్టరేట్ సిబ్బందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం ఎన్‌సిడి -3.0 సమగ్ర క్యాన్సర్ స్క్రీనింగ్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 148 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎంఎస్‌వికె.బాలాజీ మాట్లాడుతూ సాధారణ ఎన్‌సిడిల నివారణ, నియంత్రణ, స్క్రీనింగ్, జనాభా ఆధారిత స్క్రీనింగ్ ప్రోగ్రామ్ అంటే మధుమేహం, అధిక రక్తపోటు, సాధారణ క్యాన్సర్లు (ఓరల్, బ్రెస్ట్ మరియు సర్వైకల్ క్యాన్సర్లు) స్క్రీనింగ్ సర్వే చేసినట్లు తెలిపారు. 28 మంది మహిళలకు బ్రెస్ట్ స్క్రీనింగు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎన్.సి.డి. ప్రోగ్రాం అధికారి డాక్టర్ జె.ప్రశాంతి మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన అందరికీ పరీక్షలు నిర్వహిస్తారని, 30 సంవత్సరాలు వయస్సు పురుషులు, మహిళలకు నోటి క్యాన్సర్, 30 సంవత్సరాలు వయస్సు దాటికి మహిళలకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల స్క్రీనింగు చేయడం జరుగుతుందని తెలిపారు. అసాధారణ కేసులను వైద్య అధికారులు పరీక్షించి అనుమానితులను ఫాస్ట్ ట్రాక్ ఛానెల్ ద్వారా వైద్య సదుపాయం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మెడికల్ అధికారులు ఈశ్వర్ రాణి, తిరుపతిరావు, ధనంజయ్, పావని, జయదీప్, ఎన్‌సిడి సిబ్బంది మోహన్, రేవతి, శ్యామల, చైతన్య, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

చలో విజయవాడ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-చోడవరం : సిపిఎస్ రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 10వ తేదీన జరుగు చలో విజయవాడ కార్యక్రమం పోస్టర్‌ను సోమవారం దుడ్డుపాలెం గ్రామంలో ఉద్యోగులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిపిఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు జి సింహాద్రప్పుడు, దేముడునాయుడు మాట్లాడుతూ సిపిఎస్ వల్లఉద్యోగుల నష్టపోతారని పేర్కొన్నారు.

ఫిజియోథెరపీపై ఉద్యోగులకు శిక్షణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఫిజియోథెరపీపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు పని ఒత్తిడి వలన అనారోగ్య సమస్యలకు లోనవుతున్నందున, ఒత్తిడిని తగ్గించుకునేందుకు ఫిజియోథెరపీ దోహదపడుతుందని విజాం ఫిజియోథెరపీ ఇనిస్టిట్యూట్ నుంచి వచ్చిన వైద్యులు రమేష్ తెలిపారు. ఎంపీడీవో ఎం.వి సువర్ణరాజు, మండల పరిషత్ పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సాంబమూర్తిని దర్శించుకున్న సాయికృష్ణ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని నాగులపల్లి, టి సిరసపల్లి గ్రామాలలో ఉన్న సాంబమూర్తిస్వామి, వీరభద్రస్వామి ఆలయాలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయికృష్ణ సోమవారం దర్శించుకున్నారు. సాంబమూర్తి స్వామి శూలాల మహోత్సవం సందర్భంగా దేవాలయ కమిటీ వారు ఆహ్వానం మేరకు ఆయన స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు పెంటకోట విజయ్, దొరమ్మ నాయుడు, మహేష్, మోహన్, గణేష్, శ్రీరామ్మూర్తి, దేవత నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండల కేంద్రంలో రాజుల వీధిలో రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా ప్రతిపక్ష పార్టీ వారు అడ్డుకుంటున్నారని, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేయాలని ఆ కాలనీ వాసు సోమవారం ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర నిరసన తెలిపారు. న్నో ఏళ్లగా రోడ్డు, సైడ్ కాలువల సదుపాయం లేక ఇబ్బందులకు గురవుతున్నామని, ప్రభుత్వం ఎన్ఆర్ఇజిఎస్ నిధుల నుండి రూ.13 లక్షలు మంజూరు చేసిందని వారు తెలిపారు. అయితే ప్రతిపక్ష పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు రోడ్డు వేయకుండా అడ్డు పడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

హమాలీల కూలి రేట్లు పెంచకపోతే పనులు బంద్

ప్రజాశక్తి-అనకాపల్లి : పౌరసరఫరాలశాఖ హమాలీలకు కూలి రేట్లు పెంచకుంటే పనులు నిలుపుదల చేస్తామని వారు హెచ్చరించారు. ఈ మేరకు కలెక్టరేట్ వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. హమాలీలకు కూలి రేట్లు పెంచుతూ తక్షణం జీవో విడుదల చేయాలని, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నా కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం మన్మధరావు, రాజాన దొరబాబు, ప్రధాన కార్యదర్శి వి పండు బాబు, కే. త్రినాథ్, బాబురావు, సత్యం, వరహాల బాబు, అప్పారావు, తాతరావు, వెంకటరమణ, బాబ్జి, రామరాజు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాలాబు గిరిజన పంచాయతీ శివారు బుచ్చింపాలెం గ్రామానికి కోటి 20 లక్షల రూపాయలతో రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ పోడెం వెంకటలక్ష్మి బుజ్జి దంపతులు సోమవారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా బుచ్చింపాలెం గ్రామస్తులు మాట్లాడుతూ కొన్నేళ్లుగా రహదారి లేక నానా అవస్థలు పడుతున్నామని, గత ప్రభుత్వం నాయకుల దృష్టికి తీసుకువెళ్లిన పట్టించుకోలేదని తెలిపారు. సర్పంచ్ ప్రస్తుత ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే ఆయన స్పందించి ఉపాధి హామీ నిధులు మంజూరు చేశారని, టిడిపి ప్రభుత్వానికి రుణపడి ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు మెంబర్లు కే దేవుడు, కె ఈశ్వర్రావు, వి ఈశ్వరావు, టి శ్రీరామ్, సిహెచ్ వరహాల నాయుడు, గంగు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న సర్పంచ్ తదితరులు

శనివాడలో కార్పొరేటర్ పర్యటన

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని గ్రేటర్ విశాఖ 79వ వార్డు పరిధి శనివాడ గ్రామంలో ఆ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ సోమవారం పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. చిన్నవీధి రోడ్డు వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మేజర్ రోడ్డు, కాలువలు ఎస్టిమేట్లు తయారు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. మురుగు కాలువలను శుభ్రం చేయించాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి ఉన్న స్టాక్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఎలిమెంటరీ స్కూల్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక రోడ్డులో ఎలక్ట్రికల్ వైర్లు చెట్లపై ఉండడం గమనించి, వాటిని తొలగించాలని ఎలక్ట్రికల్ సిబ్బందిని ఆదేశించారు.

భానుమూర్తి యాదవ్‌కు సత్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి : జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కాంగ్రెస్ నాయకులు బోయిన భాను మూర్తియాదవ్‌ను సోమవారం గాంధీ నగర్‌లో ఆయన గృహంలో కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి దుస్సాలువలతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బీసీల అభివృద్ధి కోసం భానుమూర్తి యాదవ్ మరింతగా పోరాటం చేయాలని, రాబోయే రోజులలో మరిన్ని ఉన్నతమైన పదవులు అధిరోహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు కాళ్ళ సత్యనారాయణ, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు విస్సకోట రాము, మాడుగుల నియోజకవర్గ ఇన్చార్జి పడాల కొండలరావు, సత్యనారాయణ స్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ సేనాపతి రాజు, టి.సుబ్బిరామిరెడ్డి సేవా పీఠం మాజీ సభ్యులు మాణిక్యం, పరవాడ మండల కాంగ్రెస్ అధ్యక్షులు జి. శ్రీనివాస్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బి. బాలమురళీ పాల్గొన్నారు.

1800 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని గంటికొర్లం గ్రామం కొండ ప్రాంతంలో సోమవారం ఉదయం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ చోడవరం సిబ్బంది దాడులు నిర్వహించారు. అక్కడున్న నాటుసారా బట్టీలను, సుమారు 1800 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు

ఘనంగా గోపికృష్ణ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-కశింకోట : కశింకోట మాజీ వైస్ ఎంపీపీ వేగి గోపి కృష్ణ జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. జనసేన నియోజకవర్గం ఇన్చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) గోపికృష్ణకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమం కూటమి నాయకులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, కాంగ్రెసు సతీష్, కాయల మురళి, సిదిరెడ్డి శ్రీను, నైనంశెట్టి రమణరావు, కలగా సోమేశ్వరరావు, తాకాసి కృష్ణ, బుదిరెడ్డి గంగయ్య, ఎస్‌కే. బాబర్ పాల్గొన్నారు.

గోపికృష్ణకు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

విద్యార్థుల సామర్థ్యం పరిశీలన

విద్యార్థుల ప్రగతిని పరిశీలిస్తున్న ఎంఇఒ నూకరాజు

ప్రజాశక్తి- నక్కపల్లి : స్థానిక కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని సోమవారం ఎంఇఒ- 2 వేమగిరి నూకరాజు సందర్శించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు విద్యార్థులకు పరీక్ష నిర్వహించి వారిలో ప్రగతిని పరిశీలించారు. మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేసి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పంచతంత్రం కార్యక్రమాన్ని పరిశీలించారు. కెజిబివి డైరెక్టర్ ఆదేశాల మేరకు స్కూలును సందర్శించానని, విద్యార్థుల ప్రగతిపై ఉన్నత అధికారులకు నివేదిస్తానని ఎంఇఒ నూకరాజు తెలిపారు.

పామాయిల్ క్షేత్రాలను పరిశీలించిన కేంద్ర బృందం

ప్రజాశక్తి - రావికమతం :రానున్న రోజుల్లో ఆయల్ ఫామ్ కు డిమాండ్ పెరుగుతుందని డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ హార్టికల్చర్ కేంద్ర బృందం వెల్లడించింది. డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్ వెల్ఫేర్ అజిత్ కుమార్ సాహూ ఆధ్వర్యంలో రణవీర్ సింగ్, డైరెక్టర్ ఆఫ్ ఆయిల్ సీడ్స్ పొన్ను స్వామి, అడిషనల్ డైరెక్టర్ హార్టికల్చర్ బాలాజి నాయక్‌లతో కూడిన బృందం మాడుగుల, చోడవరం బుచ్చయ్యపేట, మండలాల్లో సాగులో ఉన్న పామాయిల్ తోటలను పరిశీలించారు. సోమవారం దుడ్డుపాలెం గ్రామానికి చెందిన రైతు పి. శ్రీరామమూర్తి, చింతలూరు గ్రామానికి చెందిన పి. బ్రహ్మానందం ఆయిల్ ఫామ్ తోటలను పరిశీలింఆచరు. ఆయా తోటల్లో అంతరపంటలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కోవడం జరిగిందన్నారు.. ఈ సందర్భంగా ఆయిల్ ఫామ్ తోటల్లో సోలార్ నీటి పంపులు, బిందుసేద్యం పరికరాలను రాయితీపై ఏర్పాటు చేయాలని కేంద్రబృందానికి రైతులు విన్నవించారు..ఈ సందర్భంగా అజిత్ కుమార్ సాహు రైతులతో మాట్లాడుతూ

ఆయిల్‌పామ్ ప్లాంటేషన్‌ను పరిశీలిస్తున్న కేంద్రబృందం

ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా కోకో సాగు కూడ లాభదాయకంగా ఉంటుందని సూచించారు. అనంతరం కొన్నెంపూడి కషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో సమావేశమయ్యారు. వివిధ రకాల ఆహార ధాన్యాలు , ఉద్యానవన పంటల పరిశోధనలు ఫలితాలు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి జి ప్రభాకరరావు, డివిజనల్ ఉద్యానవన శాఖ అధికారిణి భాను పుష్పాలు లీలావతి పాల్గొన్నారు.

బోసిపోయిన కొడవటిపూడి సచివాలయం

- సిబ్బంది లేక వెలవెల.. పనులకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి -కోటవురట్ల : ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేయాలన్న సంకల్పంతో గత వైసిపి ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన సచివాలయ వ్యవస్థ ప్రస్తుతం సిబ్బంది లేమితో కొట్టుమిట్టాడుతోంది, సోమవారం కొడవటిపూడి గ్రామంలో గల సచివాలయం అధికారులు ఎవరూ లేక ఖాళీగా దర్శనమిస్తుంది, ఇక్కడ పని చేసే కార్యదర్శి మాధవరావు ఎంపీడీవో కార్యాలయానికి మీటింగ్ నిమిత్తం వెళ్లడం కారణంగా, మిగతా సిబ్బంది ఎవరు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు, ఇక్కడ ఉండాల్సిన డిజిటల్ అసిస్టెంట్ ఎవరూ లేకపోవడంతో లింగాపురం డిజిటల్ అసిస్టెంట్ ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు, అదేవిధంగా మహిళా పోలీస్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ గాని ఎవరూ లేకపోవడం వివిధ పనులపై వచ్చే గ్రామస్తులు అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది, ఇంటి పన్ను కట్టించుకునేందుకు అదే సమయంలో నలుగురైదుగురు కార్యానికి వచ్చి వెనుతిరిగారు,ఈ విషయంపై సచివాలయ

ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్న సచివాలయం

కార్యదర్శిని వివరణ కోరగా హౌస్ హోల్డ్ సర్వే కారణంగా సిబ్బంది కొరత ఉన్నట్లు తెలిపారు, ఇప్పటికైనా అధికారులు స్పందించి సచివాలయంలో నిత్యం ఎవరో ఒక సిబ్బంది అందుబాటులో ఉండే విధంగానైనా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో పోటీలు

రోలుగుంటలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి -యంత్రాంగం

వారోత్సవాల్లో భాగంగా సోమవారం గ్రంథాలయాల్లో పలు పోటీలు నిర్వహించారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. నక్కపల్లి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి గోవిందేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ముగింపు రోజున విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నర్సీపట్నం టౌన్ : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ దమయంతి ఆధ్వర్యంలో సోమవారం విపత్తులు ఎదుర్కోవడం ఎలా అనే అంశంపై ఇంటర్మీడియట్ విద్యార్థులకు వకృత్వ పోటీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ, రిషి కాలేజీ, విద్యార్థులు పాల్గొన్నారు. సాయి దీపిక, కిరణ్, మధు ప్రియాంక తదితర విద్యార్థులు మాట్లాడారున్యాయ నిర్ణేతలుగా పీ.వి కనకరాజు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పి.ప్రభాకర్ వ్యవహరించారు.

మాడుగుల : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు సందర్భంగా శాఖ గ్రంథాలయంలో కెజె పురం విద్యార్థులకు మ్యూజికల్ చైర్, ,దేశ నాయకుల జీవిత చరిత్రపై డిబేట్ నిర్వహించామని గ్రంథాలయ సిబ్బంది వి.శృతి తెలిపారు.

కోటవురట్ల : 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ అధికారి అప్పలనాయుడు ఆధ్వర్యంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులు పాల్గొన్నారు, ఉపాధ్యాయులు ప్రసాద్, లిబియా, దుర్గ కార్యక్రమం నిర్వహించారు.

గొలుగొండ : గొలుగొండ శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో కేజీబీవీ, రెసిడెన్సి స్కూల్, చోద్యం, జోగంపేట హైస్కూల్స్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిచారు.కార్యక్రమంలో జోగంపేట, చోద్యం పాఠశాలల ఉపాధ్యాయులు చిరంజీవి, వరప్రసాద్, కేజీబీవీ నుండి రమణమ్మ, విశ్రాంత గ్రంథ పాలకుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

రోలుగుంట : స్థానిక శాఖా గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయాధికారి వరలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఆర్ఎస్.ప్రసాద్, రేవతి, అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆనందపురం: ఆనందపురం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, స్టోరీ టెల్లింగ్, స్టోరీ రైటింగ్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి బివిఎస్ అప్పారావు ఆధ్వర్యాన జరిగిన ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా ఆనందపురం ఎంపిపి పాఠశాల ఉపాధ్యాయులు జయలక్ష్మి వ్యవహరించారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా భారత రాజ్యాంగంపై విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో సెయింట్ ఆన్స్ కళాశాల విద్యార్థినులు, మల్కాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు టి.శ్రీరామ్మూర్తి, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, కవి కె.సత్తిరాజు, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పలు అంశాలపై కథల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్ ఆటల పోటీలు నిర్వహించారు. శాఖా గ్రంథాలయాధికారి ఎస్.మహేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ఎంవిపి.కాలనీలోని నగర గ్రంథాలయం ఆధ్వర్యాన నగరంలోని పాఠశాలల విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. కెడిపిఎం హైస్కూల్, జెకె హైస్కూల్, శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలను కెడిపిఎం హై స్కూల్ డ్రాయింగ్ మాస్టారు ప్రసాద్, తెలుగు ఉపాధ్యాయులు జెఎల్.సత్యవతి పర్యవేక్షించారు.

అనకాపల్లి : జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా స్థానిక శాఖ వీధి ప్రభుత్వ గ్రంథాలయ ఆధ్వర్యంలో జివిఎమ్‌సి ప్రభుత్వ పట్టణ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులకు 'మహిళల భద్రత- విద్యార్థినుల పాత్ర' అన్న అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతుల ప్రదానం చేసారు. కార్యక్రమంలో గ్రంథాలయ ప్రచార కార్యదర్శి బల్లా నాగభూషణం, పాఠశాల హెచ్ఎం రుధిరారాణి, గ్రంథాలయాధికారి కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చోడవరం : చోడవరం శాఖ గ్రంథాలయం ఆధ్వర్యాన సోమవారం గాంధీగ్రామ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాఠశాల విద్యార్థులకు 'యువతపై మాదకద్రవ్యాల ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ఇంఛార్జి హెచ్ఎం జెజె ప్రసాద్, గ్రంథాలయం అధికారి జి.తిరుమల కుమారి పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ శాఖ గ్రంథాలయ రికార్డ్ అసిస్టెంట్ కె.వి లక్ష్మణరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్మార్ట్ సెల్ఫోన్ వలన ఉపయోగాలు, నష్టాలపై డిబేట్ కాంపిటేషన్ నిర్వహించారు. టీచర్ తులసి, విద్యార్థులు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి ఎల్వి రమణ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. జడ్పీహెచ్ స్కూల్, ప్రియదర్శిని, ప్రణతి, ప్రగతి పాఠశాలల్లో డిబేట్, వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కె.కోటపాడు : కే కోటపాడు శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు సోమవారం పరుగు, వీల్ చైర్ ఆటల పోటీలను నిర్వహించారు. ఉపాధ్యాయులు మురళీకృష్ణ, విజయలక్ష్మి, లైబ్రేరియన్ కే. సౌమ్య పాల్గొన్నారు.

సబ్బవరం : సబ్బవరం శాఖా గ్రంథాలయంలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయం అధికారి. వి. శిరీష కుమారి, ఎంపీపీ స్కూల్, ఆర్కిడ్ పాఠశాల ఉపాధ్యాయులు పాణి, దివాకర్, కుమారి, పాఠకులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కాశీ, కుమారి, నర్సిహారావు, పాఠకులు సిస్ట అప్పారావు లైబ్రేరియన్ వరలక్ష్మి పాల్గొన్నారు.

ఆలయాలకు కార్తీకశోభ

ప్రజాశక్తి- నక్కపల్లి: కార్తీక మాసం మూడవ సోమవారం పురస్కరించుకుని మండలంలోని ఉపమాక శివాలయంలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుండి చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు .ఆలయ అర్చకులు మహేష్, సంతోష్ పూజలు నిర్వహించి ,తీర్థ ప్రసాదాలను అందజేశారు ఆలయం వద్ద భక్తులు, దాతల సహాయ సహకారాలతో అన్న సమారాధన నిర్వహించారు. ఉపమాక వెంకన్న ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పలు ఏర్పాట్లు చేశారు.

మాడుగుల: కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా మండలంలో జంపెన, వమ్మలి జన్నాథపురం,జాలంపల్లి గ్రామాల్లో శివ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు పెద్దఎత్తున వచ్చి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేశారు.ఆలయ సమీప ప్రాంతాల్లో వంట వార్పులు చేసుకొని కార్తీక మాస వన భోజనాలు చేశారు.మాడుగుల, కోడూరుల్లో అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

రోలుగుంట : మండలంలోని ఎంకె.పట్నం శివారు పెదపేట రెవెన్యూ పరిధిలోని ఏటిలంక వీరభద్రుని ఆలయం వద్ద బిబి.పట్నం మహిళా కోలాట గ్రూపు ఆధ్వర్యంలో సోమవారం కార్తీక సమారాధన నిర్వహించారు. సంయుక్త భోజనాలు చేశారు. అనంతరం గ్రామస్తులతో కోలాటం ప్రదర్శన నిర్వహించినట్లు పత్తి రమణ తెలిపారు.

పద్మనాభం : మండలంలోని వీకే పాలెం. పాండ్రంగి పంచాయతీ పరిధిలో ఉన్న కొరపల్లి గ్రామంలోని శ్రీ రామచంద్ర రామలింగేశ్వర ఆలయంలో కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా భారీ అన్న సంతర్పణ నిర్వహించారు. సుమారు 5000 మందికి అన్నదానం చేశారు.

పటిష్టంగా అవినీతి నిరోధక చట్టాల అమలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : ఎసిబి చట్టాలను కఠినంగా అమలు చేయాలని, లంచగొండి అధికారులపై కఠినచర్యలు చేపట్టాలని రెల్లిహక్కుల రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు ఎర్రంశెట్టి పాపారావు డిమాండ్ చేశారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ముడుపులు తీసుకుని పట్టుబడిన రాష్ట్రంలో ప్రభుత్వ అధికారులపై తక్షణమే కఠిన శిక్షలు విధించకపోవడంతో లంచావతారులు పెట్రేగిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు ఆ బాధలను తట్టుకోలేక ఎసిబిని ఆశ్రయిస్తున్న నేపథ్యంలో చర్యలు కఠినంగా ఉండాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని, అధికారులు, ఉద్యోగుల సమయపాలనపై దృష్టి పెట్టాలన్నారు.ప్రజలకు ఇబ్బంది పెడితే శిక్ష తప్పదన్న భయం అదికారుల్లో కలిగేలా తక్షణ చర్యలు ఉండాలని పాపారావు కోరారు.

ఉపాధ్యాయులకు బ్యాగుల అందజేత

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని వేంపాడు ప్రాథమిక పాఠశాలలో 180 మంది ఉపాధ్యాయులకు సోమవారం పిఆర్‌టియు .జిల్లా అధ్యక్షులు డి.గోపీనాథ్ లంచ్ బ్యాగులు అందజేశారు.. అనంతరం ఉపాధ్యాయ సంఘ నేతలతో మాట్లాడారు.ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న అనేక అపరిష్కృత సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందన్నారు. పాఠశాల సమయపాలన మార్పు, 117 జిఒ రద్దు సమస్యలను పరిష్కరిస్తామన్నారు.

రేపటి నుంచి వెంకన్న కల్యాణోత్సవాలు

ప్రజాశక్తి -ఎస్ రాయవరం : మండల కేంద్రమైన యస్ రాయవరంలో వైభవ వేంకటేశ్వరుడు గోదాదేవిల కల్యాణానికి సర్వం సిద్ధమైనట్లు ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు తెలిపారు. ఈ నెల 20వ తేదీ బుధవారం నుండి 23వ తేదీ శనివారం వరకు స్వామి తొమ్మిదవ వార్షిక తిరు కల్యాణోత్సవాలు జరుగుతున్నట్లు తెలిపారు. 22న శుక్రవారం స్వామి కళ్యాణం, తిరువీధి, 23న చక్రస్నానం అన్నసమారాధన ఉంటుందని తెలిపారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ : మండల కేంద్రంలో ఎస్ఐ పి..రామారావు ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలను ఆపి రికార్డులు పరిశీలించారు. అనంతరం ఎస్ఐ రామారావు మాట్లాడుతూ వాహనదారులందరూ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు కచ్చితంగా వాహన రికార్డులుఉంచుకోవాలన్నారు. హెల్మెట్, సీటు బెల్టు తప్పనిసరిగా ధరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రతిఒక్కరూ క్షేమంగా గమ్యాలను చేరుకోవచ్చన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే చట్టపరంగా కేసులు, జరిమానాలు తప్పవని హెచ్చరించారు.

వరి పైర్లకు తెగుళ్లపై ఆందోళన

రెల్లరాల్చు పురుగు ఆశించిన వరిపైరు

ప్రజాశక్తి-రోలుగుంట : మండలంలోని జగ్గంపేట గ్రామంలోని వరి పొలాలకు రెల్లరాల్చు పురుగు ఆశించింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యవసాయాధికారి విజయలక్ష్మీ మాట్లాడుతూ ఈ పురుగు నివారణకు క్లోరంత్రానిల్ ప్రోల్ 60ఎంఎల్ ఎకరానికి లేదా ఇమేమేక్టివ్ బెజాఎట్ 80 గ్రాములు ఎకరానికి వరి దుబ్బు మొదళ్లకు చేరేటట్లు పిచికారీ చేయాలని సూచించారు.

పాఠశాలల్లో కొత్త బోర్లు ఏర్పాటు

.ప్రారంభిస్తున్న న్యూలైఫ్ ప్రతినిధులు

ప్రజాశక్తి -నక్కపల్లి : నక్కపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, చినదొడ్డిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో న్యూ లైఫ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మంచినీటి బోర్లను. సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యూ లైఫ్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ రాజా కొలపాటి,వెల్స్ ఫర్ డైరెక్టర్ మైకివైజర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు నీటి సమస్యలు లేకుండా సంస్థ ద్వారా చేతి బోర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మండలంలో ఇంకా ఎక్కడైనా పాఠశాలల్లో నీటి ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు.ఎంఇఒ వేమగిరి నూకరాజు మాట్లాడుతూ సంస్థ ద్వారా బోర్లు ఏర్పాటు చేయడం ఆనందాయకమన్నారు.కార్యక్రమంలో వెలగా ఈశ్వరరావు, నాయకులు తోట సత్తిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిర్సాముండాకు ఘన నివాళి

నివాళులర్పిస్తున్న ఎంఇఒ, హెచ్ఎం

ప్రజాశక్తి-గొలుగొండ : గిరిజన ఆరాధ్యుడు స్వాతంత్ర పోరాటంలో ఆదిమ గిరిజన తెగలకు నాయకత్వం వహించిన బిర్సాముండా 150వ జయంతిని మండలంలోని జోగంపేట జెడ్పి ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్ఎం వి.సరోజినీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంఇఒ .సత్యనారాయణ పాల్గొనిబిర్సాముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్ఎం సరోజిని మాట్లాడుతూ అతిపిన్న వయసులో బిర్సాముండా బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి, గిరిజనుల్లో చైతన్యం కలిగించిన గొప్ప నాయకుడన్నారు. ఆదిమ తెగలకు ధైర్య సాహసాలను నూరిపోసిన బిర్సాముండా, నేటి తరానికి ఆదర్శప్రాయుడన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.అప్పారావు, ఎంపీ.శ్రీనివాసరావు, బి.సుబ్బారావు, బి.లోవరాజు, జి.రవీంద్ర, కే.సత్యనారాయణ, మహిళా ఉపాధ్యాయులు మహాలక్ష్మి, ఉషాప్రభ, భ్రమరాంబిక విద్యార్థులు పాల్గొన్నారు.

అటు వృథా.. ఇటు వ్యథ!

◆ మాడుగులలో పలు కాలనీల్లో తాగునీటికి కటకట

◆ పైపులైను లీకై, నీరు పోతున్నా పట్టని అధికారులు

పైపులైన్ నుంచి లీకౌతున్న తాగునీరు

అసంపూర్తి వాటర్ ట్యాంక్

ప్రజాశక్తి- మాడుగుల : మాడుగుల మండల కేంద్రంలో ఒకవైపు తాగునీరు వృథా, మరోవైపు వ్యథలపై స్థానికులు ఆందోళన చెందుతున్నారు. రెండు సమస్యలపైనా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు

గ్రామంలో జలజీవన్ మిషన్ల ప్రారంభమై సగం మేర ప్రజలకు తాగునీరు అందుతుంటే మిగతా ప్రాంతాల్లో నీటికి కటకట తప్పడం లేదు. తాగునీరు లేక పలు కాలనీల మహిళలు దూర ప్రాంతాలనుండి నెత్తిన బిందెలతో నీరు తెచ్చుకునే పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో మాడుగుల పంచాయతీ కార్యాలయానికి సమీపంలో తాగునీటి ప్రధాన పైపులైనుకు రంధ్రం ఏర్పడి నీరు వృథాగా పోతుండడంపై స్థానికులు తల్లడిల్లిపోతున్నారు. సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. మరోవైపు 14వ వార్డు టీచర్స్, అర్బన్ కాలనీలో 5 వందలు ఇళ్లకు ఆరునెలలుగా మంచినీరు అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద వాటర్ ట్యాంక్ పూర్తయితే గానీ ఆయా కాలనీల్లోని ఇళ్లకు నీరు అందేఅవకాశం లేదు. దీనిపై ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులకు, ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. తక్షణమే పైపులైన్ లీకేజీని అరికట్టి నీటి వృథాను తక్షణమే నియంత్రించడంతోపాటు, నీటి ట్యాంక్ పనులు పూర్తి చేసి ఇంటింటికి తాగునీటినీ అందించాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన నిర్మించడం ఆనందంగా ఉంది

● మాడుగుల సాగరం బ్రిడ్జిని పరిశీలించిన మాజీ మంత్రి బూడి

పూర్తయిన వంతెనను పరిశీలిస్తున్న ముత్యాలనాయుడు

ప్రజాశక్తి- మాడుగుల : వర్షాకాలంలో రైతులు,ప్రజలు కష్టాలను చూసి వంతెన నిర్మాణానికి నిధులిచ్చి, నిర్మాణం పూర్తిచేయించామని, దీనిపై ప్రజల కళ్ళల్లో ఆనందం చూసేందుకు వచ్చానని మాజీ మంత్రి, వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బూడి ముత్యాల నాయుడు అన్నారు. సోమవారం నూతనంగా నిర్మాణం చేపట్టిన మాడుగుల సాగరం మార్గమధ్యలో తాచేరు వంతెన పనులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా వర్షాకాలంలో నీటి ఉధృతికి రైతులు, ప్రజలు వంతెన లేక రాకపోకలకు పడుతున్న ఇబ్బందులు, నదీ ప్రవాహంలో కొట్టుకుపోయి కొంతమంది రైతులు ప్రాణాలు కోల్పోవడం, ప్రమాదాల బారి నుంచి బయటపడిన సందర్భాలు ఉండడంతో సమస్యను గత ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, నిధులు మంజూరు చేయించి పనులు చేపట్టామన్నారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకం నిధులు రూ. మూడు కోట్లతో రోడ్డుతోపాటు బ్రిడ్జి నిర్మాణం పనులు చేపట్టామన్నారు. తన హయాంలో రోడ్డు, వంతెన నిర్మాణం జరిగినా, ప్రారంభించలేకపోయానన్నారు.

అనంతరం ఆర్ఎంబి వసతి గృహంతో పాటు కింతలి వెళ్లే రోడ్డు పనులు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో చేసిన పనులు, ఇంకా పెండింగ్లో ఉన్నవాటిని పూర్తిచేసేందుకు ప్రస్తుత ఎమ్మెల్యే చర్యలు చేపట్టాలని కోరారు. మాడుగుల ఘాట్ రోడ్ లో వంతెన, కోడూరు వంతెనలు శిథిలావస్థకు చేరాయని వాటి పునర్నిర్మాణంపై ఎమ్మెల్యేబండారు దృష్టి పెట్టాలని కోరారు. గడువు కంటే ముందే వంతెన నిర్మాణం పూర్తిచేసిన కాంట్రాక్టర్ బండి వెంకటసుబ్బయ్యను సత్కరించారు.కార్యక్రమంలో ఎంపీపీ రాజారాం, వైస్ ఎంపిపి కొత్తపల్లి శ్రీనివాస్, జడ్పిటిసి కిముడు రవణమ్మ, సర్పంచ్ ఎడ్ల కళావతి, మాజీ ఉపసర్పంచ్ శ్రీనాథ్ శ్రీనివాసరావు,బొమ్మిశెట్టి శ్రీను వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలను వినియోగించుకోండి

ప్రజాశక్తి - మాడుగుల : అన్ని ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలకు, ఇతర అవసరాలకు ఆధార్ తప్పనిసరి నేపథ్యంలో ఈనెల 19 నుంచి 29 వరకు మండలంలో మొబైల్ ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ కొంకి అప్పారావు తెలిపారు. మండలంలోని కేజే పురం, కింతలి, వల్లాపురం, వీరనారాయణం, లోవ పున్నవోలు సచివాలయాల వద్ద ఈ మొబైల్ ఆధార సెంటర్లు అందుబాటులో ఉంటాయన్నారు. 0-5 ఏళ్లలోపు చిన్నారులు, 18 ఏళ్ల లోపు బాలబాలికలు ఆధార్ సవరణ చేసుకోవచ్చని సూచించారు. 2014కు ముందు ఆధార్ తీసుకుని, పదేళ్లు పూర్తిచేసుకున్న ప్రతిఒక్కరూ ఆధార్ అప్డేట్ చేసుకోవాలని సూచించారు.

ఆకట్టుకున్న కూచిపూడి నాట్యం

ప్రదర్శనలిచ్చిన కూచిపూడి కళాకారులతో నిర్వాహకులు

ప్రజాశక్తి- నాతవరం : మండలంలోని చమ్మచింత ఉత్తరవాహిని విశ్వేశ్వర స్వామి దేవాలయం వద్ద కార్తీకమాసం మూడోసోమవారం సందర్భంగా విజయవాడ వారి కూచిపూడి నృత్యం ప్రజలను అలరించింది. అలాగే కోలాటం, అన్న సమారాధన నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భారీగా వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు జరగకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు

శరవేగంగా పల్లె పండగ పనులు

నిర్మాణంలో ఉన్న కల్వర్టు

ప్రజాశక్తి -కోటవురట్ల : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన పల్లె పండగలో భాగంగా మండలవ్యాప్తంగా చేపట్టిన పనులు శరవేగంగా సాగుతున్నాయి, ఇందులో భాగంగా అక్సాహెబ్ పేట గ్రామంలో రూ.5.50 లక్షలతో శ్మశానానికి వెళ్లే రహదారి వద్ద కల్వర్టు నిర్మాణ పనులు జరుగుతుండడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు, ప్రస్తుతం జరుగుతున్న పనులు పూర్తి నాణ్యతా ప్రమాణాలతో చేపడుతున్నామని, వీలైనంత తొందరలో అందుబాటులోకి వచ్చే విధంగా పనులు వేగవంతం చేస్తామని ఎంపిటిసి శ్రీనివాస్ తెలిపారు.

నర్సీపట్నంలో యువకుడు హత్య

● బాధిత కుటుంబీకుల ఆందోళనతో పట్టణంలో ఉద్రిక్తత

హతుడు నాగేశ్వరరావు (ఫైల్)

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబీకులు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవీధిలో ఆదివారం అర్ధరాత్రి యువకుడు దారుణ హత్యకు గురయ్యారు. దీంతో మృతుని కుటుంబ సభ్యులు సోమవారం రోడ్డుపై బైఠాయించి న్యాయం జరగాలని నిరసన చేపట్టారు పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని వారించడంతోపాటు, నిందితులను పట్టుకుని శిక్షిస్తామని భరోసానివ్వడంతో ఆందోళన విరమించారు. డిఎస్పి మోహన్ తెలిపిన వివరాలివి. పట్టణంలో కొత్తవీధికి చెందిన సర్వసిద్ధి నాగేశ్వరరావు (నాగు)ను ప్రాథమిక ఆధారాలను బట్టి రౌడీ షీటర్ బండారు సంతోష్, కొత్త వీధి కొండబాబు హత్యకు చేశారని,వీరిపై కేసు నమోదు చేశామని నర్సీపట్నం డిఎస్పి మోహన్ వెల్లడించారు. హత్యకు గురైన నాగేశ్వరరావు మరో ఇద్దరు స్నేహితులను తన ఇంటికి భోజనానికి పిలిచాడని తెలిపారు. వీరు గోవింద పాలెం గ్రామంలో మద్యం తాగి, నర్సీపట్నం కొత్తవీధిలో ఉన్న నాగేశ్వరావు ఇంటికి వస్తుండగా, మార్గమధ్యలో మద్యం తాగుతున్న నిందితులు సంతోష్, కొండబాబులతో గొడవ పడ్డారనానరు. దీంతో వెంట వచ్చిన స్నేహితులు నచ్చజెప్పి, నాగేశ్వరరావును తీసుకొని ఇంటికి వెళ్లిపోయారు. తిరిగి వస్తున్న సమయంలో నాగేశ్వరావు స్నేహితుల బండి ఆపి, మళ్లీ ఎందుకు వస్తున్నారని రౌడీ షీటర్ బండారు సంతోష్ ప్రశ్నించడంతోపాటు నాగేశ్వరరావు స్నేహితుడి మెడపై సిగరెట్తో కాల్చాడు. జరిగిన ఘటనపై నాగేశ్వరావు ఇంటికి వెళ్లి చెప్పగా, ఆవేశంతో నాగేశ్వరావు వారి వద్దకు వచ్చి గొడవపడ్డాడు. ఈ గొడవలోనే నాగేశ్వరావు హత్యకు గురయ్యాడని డీఎస్పీ మోహన్ వివరించారు. హతుడు నాగేశ్వరరావు నర్సీపట్నంలో ప్రైవేట్ ఎలక్ట్రిషియన్గా పని చేసుకుంటున్నాడు. నాగేశ్వరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నర్సీపట్నంలో ఉద్రిక్తత

మున్సిపాలిటీ పరిధిలోని నాగేశ్వరరావు అనే యువకుడు హత్య నేపథ్యంలో పట్నణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని, మతుని కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద మతుని బంధువులు, స్థానిక ప్రజలు బైఠాయించారు. ఏరియా ఆసుపత్రి ముందు కూడా బైఠాయించి నినాదాలు చేశారు. దీంతో పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నించగా, నర్సీపట్నం టౌన్ సీఐ గోవిందరావు, రూరల్ సీఐ రేవతమ్మ, రూరల్ ఎస్ఐ రాజారావు, టౌన్ ఎస్ఐ రమేష్ అడ్డుకున్నారు. మృతుని బంధువులతో చర్చలు జరిపి, స్పష్టమైన హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కాగా నిందితుల్లో బండారు సంతోష్ను అరెస్టు చేశామని, కొండబాబు కోసం గాలిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. కాగా నిందితుల గాలింపునకు నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని, పట్టణంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నట్లు సిఐ గోవిందరావు వెల్లడించారు.

బరితెగిస్తున్న టిడిపి రౌడీషీటర్లు : ఉమాశంకర్ గణేష్

కొత్తవీధిలో హత్యాఘటనపై మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ స్పందిస్తూ నర్సీపట్నంలో టిడిపి రౌడీ షీటర్లు బరితెగించి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నాగేశ్వరరావును హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై మంగళవారం ఉదయం వైసిపినేతలతో కలిసి, నర్సీపట్నం డిఎస్పిని కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు.